# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ మంగళవారం | 29 జూలై 2025 | ■ 15 పేజీలు




2

ఫుడ్ ప్రాసెస్సింగ్

## భూముల్లో దొంగలు

- మట్టి తవ్వకాలతో నిలువెత్తు గోతులు
- బొందల గడ్డగా మారిన భూములు
- గుంతలతో తరచూ ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న అధికారులు..

3న ఖానాపూర్‌లో

## మీనాక్షి నటరాజన్ పాదయాత్ర

15లో



ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ఖానాపూర్ నియోజకవర్గంలో ఆగస్టు 3, 4 తేదీల్లో పాదయాత్ర చేయనున్నారు. 3వ తేదీ సాయంత్రం 5 గంటలకు పాదయాత్ర ప్రారంభిస్తారు. రాత్రి అక్కడే బస చేసి 4వ తేదీన ఉదయం శ్రమదానంలో పాల్గొంటారు.

# మోసగాళ్ల.. మాయాజాలం..!



- లక్షెట్టిపేటలో పెరుగుతున్న ఆర్థిక నేరాలు ■ రూ.కోట్లలలో అప్పులు చేసి పరార్
- రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లు చేసి రూ.11కోట్లు కుచ్చు టోపీ పెట్టిన కిలాడి
- రైతులు ఎవరూ డబ్బులు అడగకుండా కోర్టులో ఇన్సాల్వెన్సీ పిటిషన్
- వ్యాపారం కోసం వడ్డీ రూ.7కోట్లు తీసుకొని ఉడాయించిన మరో ఘనుడు
- సబ్బుల వ్యాపారంతో నమ్మించి రూ.4కోట్లతో పరారైనా మరో మోసగాడు
- దాచుకున్న సొమ్ము కోల్పోవడంతో లబోదిబోమంటున్న బాధితులు
- ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో తెలియని పరిస్థితి

రేపటి నుంచి వరుస కథనాలు మీ ప్రభాత సమాచారంలో

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

వ్యాపారరంగంలో లక్షెట్టిపేట ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతోంది. గోదావరి పరివాహక ప్రాంతమైనందున వరి పంట బాగా పండుతుంది. గోదావరి ఒడ్డున ఉన్న రైతులు మోటార్లతో, కడెం కాలువల కింద కెనాల్ నీటితో సాగు చేస్తు అధిక దిగుబడి సాధిస్తున్నారు. ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతున్న ఈ ప్రాంతంలో మోసగాళ్లు అడ్డా వేసి వ్యాపారం మొదలు పెట్టి కొన్నాళ్ళు హంగామా సృష్టించి ప్రజలను నమ్మిస్తూ మోసం చేస్తు పారిపోతున్నారు. లక్షెట్టిపేటలో మోసగాళ్ల మాయాజాలంలో చిక్కుకొన్న రైతులు, ఇతర ప్రైవేట్ వడ్డీవ్యాపారులు కోట్లాది రూపాయలు పోగొట్టుకొని దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. తాజాగా లక్షెట్టిపేకు చెందిన అక్కెనపల్లి శ్రీధర్ అనే వ్యాపారి కొన్నేళ్లుగా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాడు. రైతులను నమ్మించాడు. లక్షెట్టిపేట రైతులే కాకుండా దండేపల్లి ఇతర ప్రాంతాల రైతులు కూడా శ్రీధర్‌కు ధాన్యం విక్రయించి తమ అవసరాలకు పోను మిగితా డబ్బులు అతని వద్దే ఉంచే వారు. అయితే రైతుల డబ్బుతో వ్యాపారన్ని విస్తరించిన శ్రీధర్ ఆస్తులు, అంతస్తులు డబ్బులు కూడ గట్టుకొన్నాడు. ఇటీవల రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాడు. డబ్బులు కావాలని రైతులు అడిగితే చేతులెత్తేశాడు. రైతులు తిరుగబడితే పారిపోయాడు. 195 మందికి సుమారు రూ.11 కోట్లు బాకీ పడ్డాడు. రైతులు ఆందోళన చేసిన ఫలితం లేకుండా పోయింది. తాను దాచుకొన్న సోమ్మంతా తన బంధువుల వద్ద దాచాడని రైతుల అనుమానం. దోపిడీ మనస్తత్వంగల వడ్ల వ్యాపారి శ్రీధర్ నేరుగా కోర్టుకు వెళ్లి ఇన్సాలవెన్సీ పిటీషన్ వేశాడు. 195 మందికి రూ.6కోట్ల 98 లక్షల 85 వేలు బాకీ పడ్డానని తాను వ్యాపారంలో నష్టపోయానని పిటిషన్‌లో పేర్కొన్నాడు. కోర్టు బాధితులకు నోటీసులు జారీ చేసింది. ఇదిలా ఉండగా చిన్న చితక వ్యాపారన్ని ప్రారంభించిన హార్వేస్టర్ వ్యాపారి ఒకరు తన వద్ద బాగా డబ్బులు ఉన్నట్లు పోజులు కొట్టి వ్యాపారుల వద్ద నుంచి రూ. 7కోట్లు అప్పు తీసుకొని పరారయ్యాడు. సబ్బుల వ్యాపారం చేసే మరో ఘనుడు రూ.4కోట్లు అప్పులు చేసి ఉడాయించాడు. లక్షెట్టిపేట మోసగాళ్లు తమ మాయాజాలాన్ని ప్రదర్శిస్తూ కోట్ల రూపాయలతో ఉడాయించడం పరిపాటైంది. లక్షెట్టిపేటలో మోసగాళ్ల మాయజాలంపై 'ప్రభాతసమాచారం'లో రేపటి నుంచి ప్రత్యేక కథనాలు..





15

## తుడుం మోగించిన ఆదివాసీలు

- కలెక్టరేట్‌ను ముట్టడించిన ఆదివాసీలు ■ కలెక్టరేట్‌లోకి వెళ్లేందకు యత్నం..
- ఆదివాసీలను అడ్డుకున్న పోలీసులు ■ ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం
- జీవో 49 రద్దు చేయాలని మహాధర్నా ■ మద్దతు పలికిన ఎమ్మెల్యే హరీష్ బాబు..

కుమరంభీం కన్జర్వేషన్ రిజర్వ్ పేరిట ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో నంబర్ 49ని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీలు కదం తొక్కారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నాకు పిలుపునివ్వడంతో జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీలు పెద్దఎత్తున తరలివచ్చారు. నిరసన కార్యక్రమానికి ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కుమరంభీం చౌక్‌లోని కుమరంభీం విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ చట్టాలను తుంగలో తొక్కి జీవో 49ని తీసుకువచ్చిందన్నారు. ఆదివాసీలను అడవి నుంచి దూరం చేసే హక్కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు.

## ఫ్లైఓవర్‌పై కుంగిన రోడ్డు

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతన్‌పల్లి రైల్వే బ్రిడ్జిపై ఇటీవల నిర్మించిన ఫ్లైఓవర్‌పై వేసిన రోడ్డు సోమవారం రాత్రి కుంగిపోయింది. రామకృష్ణాపూర్ పట్టణం నుంచి మంచిర్యాల వైపునకు వెళ్లే దారిలో బ్రిడ్జిపై రోడ్డు కుంగిపోవడంతో పాటు ఫుట్‌పాత్‌పై పగుళ్లు ఏర్పడ్డాయి. రాత్రిపూట రోడ్డు కుంగడంతో వాహనదారులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.



7

## పులితో రక్ష



- వాతావరణ సమతుల్యతలో కీలకం
- రాకపోకలు తప్ప స్థిరంగా ఉండని వైనం
- కవ్వాల్‌కు పులి రాక ప్రశ్నార్థకమేనా?
- పులులకు ఆవాసం కాగజ్‌నగర్..
- తాజాగా 11కు చేరిన పులుల సంఖ్య
- పులుల బ్రీడింగ్ కేంద్రంగా కాగజ్‌నగర్
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

అడవుల రక్షణలో పులుల పాత్ర కీలకం... వీటితో వాతావరణ సమతుల్యత కూడా ఆధారపడి ఉంది. అడవుల్లో పులులు ఉంటే దట్టమైన అడవులు పెరిగేందుకు దోహదపడుతాయి. దీంతో సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండే అవకాశాలు ఉన్నాయి. పులి ఉంటే అడవులలోకి వెళ్లేందుకు భయపడటంతో అడవులకు రక్షణ ఏర్పడుతుంది. ఇలాంటి పులిని కొందరు స్వార్థపరులు చంపి చర్మం, గోర్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మనిషి మనుగడకు, పులి సంచారానికి సంబంధం ఉన్నందున పులి రక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలి. నేడు ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..




## మత్తు ముఠా అరెస్టు

- మత్తు ఇంజక్షన్లు, గంజాయి స్వాధీనం
- మత్తుకు బానిసైన ముగ్గురి బైండోవర్
- వివరాలు వెల్లడించిన నిర్మల్ ఏఎస్పీ

ముల్తానీల దాడి కేసులో

## 30మంది అరెస్ట్

- సిరిచెల్మ అటవీ ప్రాంతంలో బందోబస్తుకు వెళ్లిన పోలీసులపై కేశవపట్నం గ్రామంలో ముల్తానీల దాడి
- దాడి చేసిన ప్రధాన నిందితుల కోసం గాలింపు..



# ఫుడ్ ప్రాసెస్సింగ్ భూముల్లో దొంగలు

- అనుమతి లేకుండా పెద్ద ఎత్తున మట్టి తరలింపు
- మట్టి తవ్వకాలతో నిలువెత్తు గోతులు..
- గుంతలతో తరచూ ప్రమాదాలు
- బొందల గడ్డగా ఫుడ్ ప్రాసెసింగ్ భూములు
- చోద్యం చూస్తున్న సంబంధిత శాఖ అధికారులు



**బెల్లంపల్లి, జూలై 28 (ప్రభాత సమాచారం)**

అధికారుల నిర్లక్ష్యం పాలకుల అలసత్వం అక్రమార్కులకు కాసులు కురిపిస్తుంది. బెల్లంపల్లి పట్టణం ఫుడ్ ప్రాసెసింగ్ భూములు కొందరికి ఉపాధిగా మారింది. కాంట్రాక్టర్లు, ట్రాక్టర్ ఓనర్లు పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారు. అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిలో గత కొంతకాలంగా అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. అనుమతి లేకుండా ప్రభుత్వ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టరాదన్న నిబంధనను కాంట్రాక్టర్లు ట్రాక్టర్లు ఓనర్లు ఉల్లంఘిస్తున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు కేటాయించిన ప్రభుత్వ భూములను కొందరు కాంట్రాక్టర్లు, ట్రాక్టర్ ఓనర్లు తమ అక్రమ వ్యాపారానికి వినియోగించుకుంటున్నారు. లక్షల రూపాయలను ఉత్తిపుణ్యాన వెనుకేసు కుంటున్నారు. ప్రభుత్వ భూముల లక్ష్యంగా మట్టి దందా సాగుతుంది. పలుకుబడి, అధికారుల అండదండలతో మట్టి చోరీకి అడ్డులేకుండా పోతుంది.

**బొందల గడ్డగా ఫుడ్ ప్రాసెసింగ్ భూములు..**

బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాలకు సమీపంలో ఫుడ్ ప్రాసెసింగ్ మిశ్రమ పరిశ్రమ భూముల్లో అనుమతి లేకుండా మట్టి తరలింపుతో బొందలగడ్డలను తలపిస్తున్నాయి. కాంట్రాక్టర్లు ట్రాక్టర్ ఓనర్లు మట్టి దందా వల్ల ప్రభుత్వ సంపద దుర్వినియోగం అవుతుంది. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్భయంగా మట్టిని ఎత్తుకెళ్తున్నారు. రాత్రనకా పగలనకా మట్టి చోరీ దందా నిరంతరం సాగుతుంది. ఉచితంగా ప్రభుత్వ భూముల నుంచి మట్టిని తీసుకెళ్తూ సదరు ట్రాక్టర్ ఓనర్లు, కాంట్రాక్టర్లు లక్షల్లో లాభపడుతున్నారు. కొందరు కాంట్రాక్టర్లు తామ నిర్వహించే రోడ్డు, భవన నిర్మాణ, ఇతర పనులకు అక్రమంగా ప్రభుత్వ భూముల్లోని మట్టిని తీసుకెళు_న్నారు. ట్రాక్టర్ మట్టికి కనీసం రూ.2వేలకుపై రేటు ఉంటుంది. ఖర్చును తగ్గించుకునేందుకు కాంట్రాక్టర్లు మట్టిని స్వాహా చేస్తున్నారు. అదేవిధంగా ట్రాక్టర్లు ఓనర్లు అక్రమంగా మట్టిని తరలిస్తూ వేల రూపాయలు లబ్ధి పొందుతున్నారు. మట్టి దందా ఇక్కడ సర్వసాధారణమైంది. దీంతో పట్టణం శివారులోని ప్రభుత్వ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలతో ప్రభుత్వ భూములు బొందల గడ్డలుగా దర్శనమిస్తున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడ మట్టిని కాజేస్తారు. దీంతో శివారులోని మట్టి తవ్వకాలతో నిలువెత్తు గోతులు లేని భూమి కనిపించదంటే అతిశయోక్తి కాదు.





**చోద్యం చూస్తున్న అధికారులు..**

బెల్లంపల్లిలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నడుస్తున్న మట్టి తవ్వకాల పై అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ భూముల్లో మట్టికి రక్షణ లేకుండా పోయింది. అక్రమంగా మట్టి తరలిపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ సంపదను కాపాడాల్సిన అధికారులు ఇలా నిమ్మకు నీరెత్తినట్లు ఉండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మట్టి అక్రమ దందా పై అధికారుల నిర్లక్ష్యమో, లేదా వారితో కరచాలమా తెలియదు కానీ, బెల్లంపల్లిలో మాత్రం మట్టి దందా మూడు పూలు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు యదేచ్ఛగా సాగుతున్న మట్టి దందాను అరికట్టాల్సిన బాధ్యతను ఇక నుంచి అయినా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు సెల్ ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

# ఝురి వంతెన నిర్మాణానికి అంచనాలు తయారు చేయండి





అటుపోతే ఇటురాలేం - ఇటొస్తే అటుపోలేం

ముథోల్, జూలై 28 (ప్రభాత సమాచారం)

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే రామారావు పటేల్
- అధికారులతో కలిసి వాగును పరిశీలించిన ఎమ్మెల్యే
- కదిలించిన 'ప్రభాత సమాచారం' కథనం..
- 'అటుపోతే ఇటురాలేం - ఇటొస్తే అటుపోలేం' కథనానికి స్పందించిన ఎమ్మెల్యే రామారావు పటేల్

**ముథోల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

భారీ వర్షాలకు ఝూరీ వంతెన మునిగి రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో వంతెన నిర్మాణనికి అంచనాలు తయారు చేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అధికారులను అదేశించారు. 'ప్రభాతసమచారం' దినపత్రికలో 'అటుపోతే ఇటురాలేం - ఇటొస్తే అటుపోలేం' అనే శీర్షికన జిల్లా అనుబంధంలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే స్పందించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఝూరీ గ్రామస్తులు ఇబ్బందులు పడడంతో సోమవారం ఆయన వంతెనను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరలో సంబంధిత శాఖ మంత్రి వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరిస్తానన్నారు. గ్రామస్తులతో కలిసి సమస్యను సంబంధిత మంత్రికి వివరించనున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు రోజుల్లో ఝురి వాగుపై వంతెన నిర్మాణానికి సంబంధించి అంచనాలతో కూడిన నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత పది సంవత్సరాలుగా సమస్యను పరిష్కరించని పాలకులు ఇప్పుడు వంతెనకు నిధులు మంజూరు చేయిస్తానని చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. గతంలో పదేళ్ల పాటు ఉన్న పాలకులు సమస్యను ఎందుకో పరిష్కరించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే ప్రకటనతో ఝురి గ్రామస్తులతో పాటు పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర వాసులూ హర్షం వ్యక్తం చేశారు.



## మందులు అంబాటులో ఉండాలి

### బస్తీ దవాఖానాను తనిఖీ చేసిన కలెక్టర్

**ఆదిలాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీలో ఉన్న బస్తీ దవాఖాన, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో దవాఖానలో సరిపడినంత మందుల స్టాక్ ఉందో లేదో అనే విషయాన్ని పరిశీలించారు. అలాగే రోగులకు అందుతున్న వైద్య సేవల నాణ్యతపై అధికారులను ప్రశ్నించారు. దవాఖాన నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను, రోగుల నమోదు వివరాలను, ఔషధాల జాబితాను, స్టోర్ రూమ్, అటెండెన్స్ రిజిష్టర్, ప్రయోగశాల పరీక్షలు నమోదు చేస్తున్నది లేనిది, మందులు ప్రాపర్‌గా ఉన్నాయా లేవా, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉన్నాయా లేదో చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతూ వైద్యసేవలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకొని, వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రత పాటిస్తూ శుభ్రంగా ఉనాడాలని సూచించారు. వైద్యసిబ్బందితో మాట్లాడి, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే దిశగా కొన్ని సూచనలు చేశారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో పారదర్శకత ఉండాలన్నారు. డాక్టర్ శ్రీని వాస్, స్టాఫ్ నర్స్ సుమలత, ల్యాబ్ టెక్నీషియన్ వెంకన్న తదితరులున్నారు.



## కోటపల్లి కేజీబీవీలో ఇంటర్‌కు స్పాట్ అడ్మిషన్లు

**కోటపల్లి, జూలై 28 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా బైపీసీ సీట్లు కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని కళాశాల స్పెషల్ ఆఫీసర్ హరిత ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు ఈ నెల 29, 30 తేదీలలో కళాశాలలో నేరుగా సంప్రదించి అడ్మిషన్ పొందవచ్చని వివరించారు. ఇంటర్ ప్రవేశం పొందే విద్యార్థులు వారి విద్యార్హత ధృవీకరణ పత్రాలతో పాటు ఆధార్, ఇతర ధృవీకరణ పత్రాలు తీసుకురావాలని స్పెషల్ ఆఫీసర్ సూచించారు.

## కాలం చెల్లిన ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**సారంగాపూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

సారంగాపూర్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఎరువులు, విత్తనాల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, రసీదు పుస్తకాలు తదితరాలను పరిశీలించారు. వానాకాలం సాగు సమయంలో రైతులకు ఎరువులు, విత్తనాల అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతుల అవసరాల మేరకు సరిపడే నిల్వలు ఉండేలా పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. రైతులను మోసం చేసే చర్యలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గడువు ముగిసిన, నాణ్యతలేని ఎరువులు లేదా విత్తనాలు విక్రయిస్తే సంబంధిత విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ తనిఖీలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, సంబంధిత అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆదిలాబాద్‌లో ప్రజావాణికి 114 దరఖాస్తులు స్వీకరణ

**ఆదిలాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

అదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెనీ కలెక్టర్ సలోని లు పాల్గొని, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 114 దరఖాస్తులు స్వీకరించగా, భూ సమస్యలు, పెన్షన్లు, విద్యుత్ సమస్యలు, విద్య, వైద్యం తదితర విభాగాలకు సంబంధించినవిగా తెలిపారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.





# అర్హులందరికీ రేషన్ కార్డులు

**■ లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ ■ అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు వస్తాయి ■ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ■ రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ ■ కలెక్టర్ అభిలాష అభినవ్**





**సారంగాపూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులను అందిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం సారంగాపూర్ మండలంలోని కౌట్ల గ్రామ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డితో కలసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేసిన నూతన రేషన్ కార్డులు పేదలకు వరంగా మారాయన్నారు. సారంగాపూర్ మండలంలో 1425 కార్డులు జారీ చేయడం జరిగిందన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో మొత్తం 10,325 కార్డులు మంజూరుతో పాటు 2000 పైగా రేషన్ కార్డులలో కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం జరిగిందని తెలిపారు. ఇంకా అర్హులైన వారు మిగిలి ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పథకాలు అన్నింటికి రేషన్ కార్డులే ప్రామాణికం అని, గత కొద్ది రో జులుగా నూతన రేషన్ కార్డులు అందకపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ కార్డుల ద్వారా ప్రజలందరికీ ఆరు కిలోల చొప్పున రేషన్ దుకాణాల ద్వారా ఉచిత సన్న బియ్యం అందుతాయని చెప్పారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, అ ర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు అం దించాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం అభినందనీయం అన్నారు. రేషన్ కార్డులు లేక ఇప్ప టివరకు ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు రానివారికి వెంటనే మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారుల కు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, తహ సీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఇతర అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



## డెంగ్యూ, మలేరియా పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్

**లక్షెట్టిపేట, జూలై 28 (ప్రభాత సమాచారం)**

డెంగ్యూ, మలేరియా సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ వైద్యులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని 30 పడకల సామాజిక ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన ఆసుపత్రిలో ఉన్నటువంటి సిబ్బంది కొరతను జిల్లా కలెక్టర్ తో సమన్వయం చేసుకుని అతి త్వరలో భర్తీ చేస్తామన్నారు. ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ వంటి వాటిపై నిర్లక్ష్యంగా ఉండకూడదని సూపరింటెండెంట్ ఆకుల శ్రీనివాస్కు సూచించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గైనకాలజిస్ట్, స్కానింగ్, ఇతర టెస్ట్ లు అన్ని అందుబాటులో ఉన్నాయని వివరించారు. అనంతరం పలు వార్డ్స్ ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, డాక్టర్స్ సురేష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

## వరిలో పురుగుల ఉధృతిపై రైతులకు సూచనలు

**మందమర్రి, జూలై 28 (ప్రభాత సమాచారం)**

వరిలో నారు కొనలు తుంచడం ద్వారా ప్రధాన పొలంలో కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించుకోవడమే కాకుండా పురుగుమందుల పిచికారి రూపంలో పెట్టుబడి కూడా తగ్గుతుందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుడిపల్లి గ్రామంలో సోమవారం వరి సాగులో నారు కొనలు తుంచడంపై రైతులకు, వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరి నాట్ల సమయంలో కొనలు తుంచడం ద్వారా పురుగు మందుల పెట్టుబడి తగ్గడమే కాకుండా నేలను వాతావరణాన్ని కాలుష్యం బారి నుండి కాపాడుకోవచ్చునని ఆయన స్పష్టం చేశారు. అంతే కాకుండా నాట్ల సమయంలో ఒక గుడ్డకు రెండు నుంచి మూడు నారు కర్రలను మాత్రమే వినియోగించాలని, గుడ్డకు గుడ్డకు మధ్య కేవలము 15



సెంటీమీటర్ల ఎడం ఉంచాలని అన్నారు. నారు కర్రలను ఎక్కువగా వినియోగించడం ద్వారా గాలి, వెలుతురు, పోషకాల వినియోగంలో కర్రల మధ్య పోటీ ఏర్పడి సరైన పిలకలు రాక దిగుబడులు తగ్గుతాయని, ఒక గుడ్డకు కేవలం రెండు నుంచి మూడు నారు కర్రలను మాత్రమే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో రైతు రాజయ్య, రైతు కూలీలు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదిన వేడుకలు.. ఉపాధ్యాయుడి సస్పెండ్

**చెన్నూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

చెన్నూరులోని ఎన్‌పీవాడ జడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆర్‌కె ప్రసాద్ అనే ఉపాధ్యాయుడిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. 24న మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించినందుకుగాను గవర్నమెంట్ స్కూల్ టీచర్‌పై వేటు పడింది. ఈ ఘటనను విద్యాశాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలను రాజకీయ కార్యక్రమాలకు వేదికగా మార్చడంపై సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి. 24న ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు జడ్పీహెచ్ పాఠశాలలో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు కుర్చీలను పంపిణీ చేశారు ఇంత వరకు బాగానే ఉంది. బీఆర్ఎస్ కండువాలు వేసుకున్న నాయకులు.. పాఠశాలలో జై తెలంగాణ, జై కేసీఆర్, జై కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. విద్యార్థులతో సైతం నినాదాలు చేయించారు. ఈ విషయం విద్యాశాఖ ఉన్నతాధికారుల వరకు చేరింది. నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో.. జిల్లా విద్యాధికారి యాదయ్య విచారణ జరిపి ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడిగా వ్యవహరించిన ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



## సిర్పూర్‌లో కలెక్టర్ పర్యటన

**ఆసిఫాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

సిర్పూర్ (టి) మండలంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే సోమవారం ఎమ్మెల్సీ దండే విఠల్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సందర్శించి రోగులను పరామర్శించారు వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మొయినోద్దీన్, ఏడిఏ మనోహర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రత పాటించాలి

**బజార్‌హత్నూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ మొదలగు జ్వరాలు రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ భీమ్రావు అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పర్ పల్లి గ్రామంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ భీమ్రావు మాట్లాడుతూ.. కీటక జనిత వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కలిగించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నియంత్రణ, మలేరియా, డెంగ్యూ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ఎస్ సుశీల, సూపర్వైజర్ ఉల్లరాణి, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్ఎం మంజుల పాల్గొన్నారు.



### ఆదిలాబాద్‌లో ఆగస్టు 5న

## మెగా జాబ్ మేళా

**ఆదిలాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**




నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేల ఆగస్టు 5న జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జాబ్ మేళా గురించి అన్ని శాఖల అధికారులు సహకరిస్తు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలోతెలంగాణ ప్రభుత్వ టాస్క్ ఆర్గనైజేషన్ టాస్క్ స్టేట్ ఆర్గనైజేషన్ ప్రదీప్ కుమార్, (టాస్క్) ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళా పోస్టర్లను విడుదల చేశారు. జాబ్ మేళాలపై అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటు అర్హులు సద్వినియోగం చేసుకునేల చూడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ప్రయివేట్ సెక్టార్లో ఉద్యోగం కల్పించేల నిర్వహించే జాబ్ మేళను సద్వినియోగం చేసుకునేల ప్రతి శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ఆయా కంపెనీల్లో 13 వందల ఖాళీల కోసం జాబ్ మేళా ఉంటుందన్నారు. పదవ తరగతి నుంచి ఆపై చదువుకున్న వారికి వివిధ పోస్టుల్లో భర్తీ చేసుకుంటారని తెలిపారు. ఈ జాబ్ మేళాలో దాదాపు 20 ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు పాల్గొని వివిధ రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్.ఎస్.సీ నుండి పీజీ వరకూ అర్హత కలిగిన యువతకు టెక్నికల్ , నాన్ టెక్నికల్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని వివరించారు. అభ్యర్థుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు సంబంధిత అధికారులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్, ఇతర సంస్థల ప్రతినిధులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులను ప్రోత్సహించి జాబ్ మేళాలో భాగస్వామ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్ర, ఆర్డీఓ స్రవంతి, టాస్క్ మేనేజర్ సాయికుమార్, స్టేట్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ ఉన్నారు.



# ప్రతిష్టాత్మక పథకాల అమలులో వేగం పెంచాలి

- క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలి
- ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

ప్రతిష్టాత్మక ప్రభుత్వ పథకాల అమలు పక్కాగా జరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సమస్యలు పరిష్కరించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, సంబంధిత శాఖల అధికారులు నిరంతరం ప్రభుత్వ వసతిగృహాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎరువులు-విత్తనాల దుకాణాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, రేషన్ కార్డుల జారీ, వనమహోత్సవం, ఫీవర్ సర్వేలు, వెటర్నరీ క్యాంపులు, పీఎం ఆవాస్ యోజన వంటి కార్యక్రమాలను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో మండలాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్ అధికారులు పర్యటించి పరిస్థితిని సమీక్షించాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు వైద్య, పంచాయతీ, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం అవసరమని చెప్పారు. బాధితులకు వెంటనే వైద్యం అందించాల్సిన బాధ్యత సంబంధిత



అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రతి ఓపి రోగికి జ్వరాల పరీక్షలు చేయాలని, ముందస్తు వైద్యం అందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి శుక్రవారం స్కూల్ డే నిర్వహించాలని, ప్రత్యేక అధికారులు పరిశీలించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతున్నదని, గ్రౌండింగ్ ప్రక్రియను మరింత ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాల పత్రాలను అందజేత

**ఆదిలాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

మరణించిన ప్రభుత్వ ఉద్యోగులపై ఆధారపడిన (33) మందికి కారుణ్య నియామక కౌన్సెలింగ్ 15.07. 2025న ఆదిలాబాద్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించబడిన 33 మందిలో ఆఫీస్ సబార్డినేట్లుగా కేటాయింపు/పోస్టింగ్ కోసం వివిధ విభాగాలలో ఖాళీల లభ్యత వారి విద్యార్హతలకు లోబడి 13 మందికి సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో వివిధ విభాగాలలో నియమితులైన అభ్యర్థులు కార్యాలయ సబార్డినేట్ లు, జూనియర్ అసిస్టెంట్‌లు, టైపిస్టులు, టెక్నికల్ విభాగాలలో నియమితులైన వారు ఆయా శాఖలలో తమ విధులను సక్రమంగా నిర్వహించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, ఏవోవర్ణ, తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యమైన విద్య అందించాలి

**నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి పోటీ పడాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని కస్బ జుమ్మా రాజ్ పేట్ ఉన్నత పాఠశాల ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనం, విద్యా ప్రణాళిక అంశాలపై ఉపాధ్యాయులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయి బాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ

**ఆదిలాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

సాత్నల మండలంలోని మేడిగూడ రోడ్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న సవాయి ప్రకాష్ తన కుమారుడు కోడలు పాఠశాలలో గల 101 విద్యార్థులకు 30 వేల రూపాయల విలువగల వైట్ యూనిఫాంలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పాఠశాల పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తగ్గకుండా అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్లాలనే ఉద్దేశంతో తాను ఈ వైట్ యూనిఫామ్ విద్యార్థులందరికీ అందజేశానని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన యంపిడిఓ సాత్నాల వెంకట్ రాజు, యంఈఓ గంగుల శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సంజీవరెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిట్కే ప్రకాశ్ కుటుంబ సభ్యుల దాతృత్వాన్ని కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన రిటైర్డ్ ప్రొఫెసర్ విజయ్ బాబు,



గ్రామస్తులు పెద్దలు ప్రధానోపాధ్యాయుల పనితీరును ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లెనిన్ బాబు, భూమన్న, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

### ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా

**ఉట్నూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందనిసమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ - ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్ లోని ఐటిడిఏ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. తలమడుగు మండలం కోసాయి గ్రామానికి చెందిన లక్ష్మీబాయి తనకు ఇంటి నిర్మాణ బిల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. గాదిగూడ మండలం ఝరి గ్రామానికి చెందిన కడప రవీందర్ తనకు అవ్వల్ అంబులెన్స్‌లో డ్రైవర్ ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఉట్నూర్ మండలం బాలనపూర్ గ్రామానికి చెందిన మెస్రం గిరిజాబాయి తనకు బోర్ వెల్, సోలార్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లింగాపూర్ మండలం జాముల్దార గ్రామానికి చెందిన పుర్క లక్ష్మి తన ఎద్దులు చనిపోయాయని, ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. వీటితోపాటు పెన్షన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీదారులు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బాలశక్తి కార్యక్రమం కింద సోమవారం నిర్మల్ పట్టణంలోని ఈద్గామ్ చౌరస్తాలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆర్థిక సాక్షరతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీరామ్ గోపాల్ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే మొదటిసారిగా నిర్మల్ జిల్లాలో బాలశక్తి కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టడం గర్వకారణమన్నారు. ప్రతి విద్యార్థికి బ్యాంకింగ్ పద్ధతులు, ఆర్థిక నైపుణ్యాలపై అవగాహన అవసరం అని తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో సైబర్ మోసాల ప్రబల నేపథ్యంలో ఆర్థిక జాగ్రత్తలపై విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బార్టర్ వ్యవస్థ నుండి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుకు దారితీసిన పరిణామాలపై, ఆర్‌బీఐ పాత్ర, బ్యాంకుల జాతీయీకరణ అవసరం వంటి అంశాలపై సమగ్ర సమాచారం అందించారు. అలాగే, సేవింగ్స్ అకౌంట్లు రికరింగ్ డిపాజిట్, టర్మ్ డిపాజిట్, కరెంట్ అకౌంట్లు వంటి ఖాతాల రకాలపై వివరించారు. బ్యాంకు కస్టమర్, నాన్ కస్టమర్ మధ్య తేడాలు, బ్యాంకింగ్ సేవలపై స్పష్టతనిచ్చారు. చెక్కుల జాగ్రత్తలు, రుణాల వర్గీకరణ, మూడవ పార్టీకి చెక్కులిచ్చే విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బేరర్, ఆర్డర్, స్టేల్, అవుట్‌డేటెడ్ చెక్కుల విషయాలను వివరించారు. భద్రతతో కూడిన రుణాలు, భద్రత లేని వ్యక్తిగత రుణాల మధ్య తేడాలపై అవగాహన కల్పించారు. అలాగే, ఆర్థిక విధానాలు, డిజిటల్ లావాదేవీలు, రిజర్వ్ బ్యాంక్ విధానాలు క్యాసా డిపాజిట్లు, వడ్డీ రేట్లు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. సైబర్ భద్రత నేపథ్యంలో ఓటీపీ, నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్, సీవీవీ నంబర్లు ఇతరులతో పంచుకోవద్దని, సైబర్ మోసాల నుంచి ఎలా కాపాడుకోవాలో సూచనలు అందించారు. లావాదేవీలను వివరించారు. విద్యార్థులు ఆసక్తితో పాల్గొని ప్రశ్నలు అడిగి తగిన జ్ఞానం సంపాదించారు. ఈ కార్యక్రమంలో అంబాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## జాతీయ ప్రధాన కార్యదర్శిని కలిసిన నిర్మల్ నేత

**నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

అవినీతి నిర్మూలన సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి అలోక్ రవీంద్రను ఆదివారం కలిసినట్లు తెలంగాణ సమాచార హక్కు పరిరక్షణ కమిటీ అధ్యక్షులు సయ్యద్ హైదర్ తెలిపారు. అవినీతి వ్యతిరేకంగా జాతీయ కమిషన్ చేసిన కృషిలో తాము కూడా సహకారం అందిస్తామని ఆయనకు తెలిపినట్లు హైదర్ వివరించారు. నాయకులు వినోద్ సాదిక్ శ్రీనివాస్ తదితరులున్నారు.




## జీవో 49 రద్దు చేయాలని ర్యాలీ

**బెజ్జూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో జీవో నెంబర్ 49 రద్దు చేయాలని రైతులు, గిరిజన నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి ఆదివాసీ నాయకులు, రైతులు వాహనాల ద్వారా కలెక్టరేట్ చేరుకొని మహాధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. జీవో నెంబర్ 49 తాత్కాలిక నిలిపివేత కాకుండా పూర్తిగా రద్దుచేసి తీరాలని డిమాండ్ చేశారు. 49 జీవోతో మారుమూల ప్రాంతాలైన గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుందని ఆదివాసి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో నెంబర్ 49 వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఆదివాసి నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేష్, పెద్దల సంతోష్, మేడి సతీష్, కొడుప శంకర్, చౌదరి గంజిరాం గిరిజన నాయకులు రైతులు పాల్గొన్నారు.

## అర్జీలు స్వీకరించిన జిల్లా ఎస్పీ



**నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లా ఎస్పీ జానకి షర్మిల హాజరయ్యారు. నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదుదారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ సమస్యలను పరిష్కరించాలనిఎస్పీ ఆదేశించారు.

## కాంబ్లే సేవలు చిరస్మరణీయం

**నార్నూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

డీసీసీబీ చైర్మన్ నాందేవ్ కాంబ్లే సేవలు చిరస్మరణీయమని ఆదిలాబాద్ జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజాల గ్రామంలో నాందేవ్ కాంబ్లే 4వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ జనార్ధన్ పాల్గొని నాందేవ్ కాంబ్లే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాందేవ్ సామాజికంగా, రాజకీయంగా నిస్వార్థంగా అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, మాజీ సర్పంచ్ జ్ఞానేశ్వర్, అన్నా బావ్ సాతే, సంఘం జిల్లా అధ్యక్షుడు ఉద్ధవ్ కాంబ్లే, తుకారాం, చంద్రశేఖర్, సయ్యద్ ఖాశీం, సుల్తాన్ ఖాన్, మహదేవ్ కాంబ్లే తదితరులున్నారు.




# ప్రభుత్వ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ఆసిఫాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ మండలంలో పర్యటించి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఇందులో భాగంగా అడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, జనకాపూర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఆర్ఆర్ కాలనీ, యుఆర్ఎస్ఆర్ఆర్ కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు



అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. హాజరు రిజిస్టర్ను పరిశీలించి వైద్యులు, సిబ్బంది విదుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సమయపాలన పాటించాలని తెలిపారు. నిరుపేదలకు ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, లబ్ధిదారులు వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పోషకాహారాన్ని అందించాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యాబోధన పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కవ్వాల్ టైగర్ జోన్‌లో ఆంక్షలు ఎత్తివేయాలి



**జన్నారం, జూలై 28 (ప్రభాత సమాచారం)**

కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం, దండేపల్లి, కడెం మండలాల అభివృద్ధి చెందాలంటే టైగర్‌జోన్‌లో ఉన్న ఆంక్షలు ఎత్తివేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి రఘునాథ్‌రావు అన్నారు. 13వ రోజు రిలే దీక్షలో పాల్గొని మద్దతు పలికారు. అదే విధం గా ఖానాపూర్ రైతు నేత, సదర్మట ్కాలువా సాధన సమితి అధ్యక్షుడు రా జేందర్ అపావత్ మాట్లాడుతూ కవ్వాల్ టైగర్‌జోన్ పేరుతో ఇక్కడి ప్రజ లను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కవ్వాల్ అభయారణ్యంలోని పులుల అభయార ణ్యంగా మార్చి ఇక్కడ ఉన్న యువతకు ఉపాధి లేకుండా భారీ వాహనా లను అనుమతించకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కొప్పుల లచ్చన్న, శ్రీనివాస్‌తో పాటు బీజేపీ నాయకులు బద్రీనాథ్, రమేశ్‌గౌడ్, మధుసూదన్, గోలి చందు, తదితరులు పాల్గొన్నారు.

## హెపటైటిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

**జన్నారం, జూలై 28 (ప్రభాత సమాచారం)**

ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా తపాలపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెపటైటిస్ వ్యాధి పై కొల్లూరి కమలాకర్ హెల్త్ అసిస్టెంట్ అవగాహన కల్పించారు. హెపటైటిస్ వ్యాధి అపరిశుభ్రమైన ఆహారము, కలుషితమైన నీరు తీసుకోవడం, రక్త మార్పిడి మరియు అపరిశుభ్రత సిరంజీలు, పచ్చబొట్లు వల్ల ఒకరి నుండి ఒకరికి హెపటైటిస్ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉన్నదని, హెపటైటిస్ రకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి నిరోధక టీకాల గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మురళీధర్, ఉపాధ్యాయులు తిరుపతి, తుంగూరి గోపాల్ పాల్గొన్నారు.





## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం ఉండాలి

### వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్

**బెల్లంపల్లి, జూలై 28 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిని సోమవారం ఆరోగ్య వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వైద్య సేవలపై వాకబు చేశారు. మలేరియా, డెంగ్యూ విష జ్వరాల నియంత్రణకు ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య సేవలను సమర్థ్వయంతో అమలు చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డిసిహెచ్ఎస్ కోటేశ్వరరావు, ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్.రవి వైద్యులు, వైద్య విధాన పరిషత్ అధికారులు ఉన్నారు.

## ఆర్ఎంపీలపై వేధింపులను ఆపాలి



**నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందిస్తున్న ఆర్ఎంపీలపై వైద్య ఆరోగ్యశాఖ చేపడుతున్న వేధింపులను వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం జిల్లాలో ఆర్ఎంపీలు నిరసన తెలిపారు. నిర్మల్ భైంసా ఖానాపూర్ పట్టణాలతో పాటు ఆయా గ్రామాల్లో నిరసన తెలిపిన ఆర్ఎంపీలు ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు, ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు వినతి పత్రాలను అందించారు. ఆయా మండలాల ఆర్ఎంపి వైద్యుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**జైనూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

కోహినూర్(కె) గ్రామానికి చెందిన తుమ్రం లచ్చుబాయి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ సోమవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

## సోయం బాపురావుపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు



**ఉట్నూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎంపీ సోయం బాపురావుపై వ్యక్తిగత ఆరోపణలకు దిగితే సహించేది లేదని ప్రత్యర్థి గిరిజన సంఘాల నాయకులను రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషం రావు హెచ్చరించారు. సోమవారం ఉట్నూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసుల సంక్షేమం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ ఆదివాసుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు పై కొందరు పనిగట్టుకొని వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన 49 జీవో రద్దు కోసం రాష్ట్రంలోని మంత్రులను ప్రజా ప్రతినిధులను వెంట పట్టుకొని ముఖ్యమంత్రిని కలిసి జీవో 49ని తాత్కాలికంగా రద్దు చేయించిన ఘనత సోయం బాబు రావు ది అన్నారు. కేంద్ర మంత్రి ని సైతం కలిసి టైగర్ జోన్ జిఓ రద్దు చేయాలని ఈ జీవో ద్వారా ఆదివాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలపడం జరిగిందన్నారు. సోయం బాబురావు పై కొందరు వ్యక్తిగత ఎజెండాలతో ఆరోపణలు చేయడం మానుకోవాలి అన్నారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే పరిణామాలు చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. రాజ్గోండు సేవాసమితి ఆదివాసి గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. ఆదివాసి గిరిజనుల కోసం ఏర్పాటు అయినా సంఘాలు గిరిజనుల అభివృద్ధి సంక్షేమంతో పాటు సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలి కానీ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాడుతున్న ప్రతినిధులను విమర్శించడం సరైంది కాదన్నారు. రాజ్గోండు సేవాసమితి నాయకులు ఏమైనా తప్పులు చేస్తే తమకు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. తొలిసారిగా రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా సోయం బాపూరావు ప్రమాణ స్వీకారం చేశారని, జిల్లా ప్రధాన కార్యదర్శి నిరంజన్, ప్రకాష్, కాశిరాం, గజానంద్,సీడాం కృష్ణ, తొడసం భీమ్రావులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను
# అధికారులు సమన్వయంతో పరిష్కరించాలి

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**మంచిర్యాల, జూలై 28 (ప్రభాత సమాచారం)** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జన్నారం, దండేపల్లి మండల వాసులు లక్షెట్టిపేట నుండి దండేపల్లి, జన్నారం మీదుగా నిర్మల్, ఆదిలాబాద్ రాష్ట్ర రహదారులపై పగటివేల భారీ వాహనాల రాకపోకలపై రాష్ట్ర అటవీ శాఖ విధించిన నిషేధాన్ని ఎత్తివేసేలా చర్యలు తీసుకొని మండలాల అభివృద్ధికి తోడ్పడాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నేపల్లి మండలం కన్నేపల్లి గ్రామస్తులు కన్నేపల్లి, ముత్తాపూర్, అంకన్నపేట శివారులలో గల సీలింగ్, అసైన్డ్, ఇనాం, లావుని, ప్రభుత్వ భూములను పొందిన వాటికంటే ఎక్కువగా భూమి అనుభవిస్తున్న వారి భూముల కొలతలు చేయించి నిరుపేదలైన తమకు వ్యవసాయం చేసుకునేందుకు జీవనాధారం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణం టేకుల బస్తీకి చెందిన తోట పోచన్న తనకు గల భూమిలో వేరొక వ్యక్తి ఇల్లు ఉన్నట్లుగా తప్పుడు సమాచారంతో ఇంటి నెంబరు పొంది పట్టా తీసుకున్నాడని, ఈ విషయమై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన బొమ్మ శ్రీనివాస్ తన తండ్రి పేరిట కాంబోజి పేట శివారులో భూమి ఉందని, ఇట్టి భూమిని తమకు తెలియకుండా వేరొకరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తన పేరిట విరాసత్ పట్టా మార్పు చేయాలని



కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం ధర్మరావుపేట గ్రామానికి చెందిన ముక్కిడి మల్లయ్య, ఏనుగు జనార్దన్ రెడ్డి రాళ్లవాగు ప్రాజెక్టు క్రింద కాలువ నిర్మాణంలో తమ భూమి పోయిందని, నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 72 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.




## విద్యాశాఖ మంత్రిని నియమించాలి

**మంచిర్యాల, జూలై 28 (ప్రభాత సమాచారం)** రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతో సమస్యలు ఎక్కడికక్కడే ఉండిపోతున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు శనిగరపు రజినీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ వర్క్ షాప్ నకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అసలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు, ఎస్ఎంహెచ్ కళాశాలల హాస్టల్స్ కి సొంత భవనలు లేకపోవడంతో విద్యార్థులు అద్దె భవనాల్లో ఉంటూ తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మధ్య తరగతి కుటుంబ విద్యార్థులకు స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాకపోవడంతో సర్టిఫికెట్ తీసుకుందామంటే ప్రైవేటు కాలేజీ యజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయన్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు, ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, ఈదునూరి అభినవ్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ రత్నవేణి, జిల్లా సహాయ కార్యదర్శి నిఖిల్, నస్పూర్ మండల నాయకులు ప్రతీక్, సాయి కృష్ణ, రాంచరణ్, అమోగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను బలోపేతం చేయండి

**నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో సంఘం నాల్గవ మహాసభలను ప్రారంభించారు. మొదట జెండాను ఆవిష్కరించి ఏఐఎస్ఎఫ్ విద్యారంగ సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. ఫీజు రియంబర్స్మెంటును వెంటనే విడుదల చేయాలని ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని తీర్మానం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి విలాస్ సంఘం నాయకులు రవిగా



రవీందర్ శ్రీకాంత్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట ఆదివాసీల ధర్నా



**మంచిర్యాల, జూలై 28 (ప్రభాత సమాచారం)** ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రయ్యకు అందించారు. అంతకు ముందుగా ప్రధాన రహదారి ప్రధాన ద్వారం వద్ద నుంచి ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ మాట్లాడుతూ టైగర్ జోన్‌ను పూర్తిగా ఎత్తి వేయాలని, 49 జీవోను పూర్తిగా రద్దు చేయాలన్నారు. పోడు వ్యవసాయానికి పట్టాలను ఇవ్వాల న్నారు. వైల్డ్‌లైఫ్ సంచార్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దసలి పట్టు గూళ్ళ రైతుల మీద అటవీ శాఖ అధికారుల దాడులు ఆపా లని, పంట వేసే వెసులుబాటు కల్పించాలన్నారు. ఆదివాసీలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెడంకి మాంతయ్య, దుగ్నె జయులు, గంట బాపులతో పాటు వివిధ మండలాలకు చెందిన పలువురు ఆదివాసీలు పాల్గొన్నారు.



## గిరిజన క్యాంటీన్‌లో
# నాణ్యత పాటించాలి

### ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా

**ఉట్నూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)** పట్టణంలో సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ -జంగు బాయి గ్రూపు సభ్యులచే నడపబడుతున్న గిరిజన క్యాంటీన్‌లో ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ -ఉట్నూరు ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం గిరిజన క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి సామాగ్రి, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఉట్నూర్ పట్టణంలోని సెరికల్చర్ ప్రాంగణంలో గత సంవత్సరన్నర కాలంగా నిర్వహించబడుతున్న గిరిజన క్యాంటీన్‌లో భోజనం రుచికరంగా ఉండాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. దాదాపు 350 మంది భోజనానికి వస్తారని, అందులో 35 కిలోల బియ్యం, 10 కిలోల పప్పు, 10 కిలోల కూరగాయలు వండి పెడుతున్నామని, ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు భోజనం అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులు, ఆటో డ్రైవర్లు, తాపీ మేస్త్రి పని వారు, కిరాణా షాపులలో పనిచేసేవారు, పట్టణంలోని ప్రైవేట్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, వీధి వ్యాపారులు భోజనాలు చేస్తుంటారని తెలిపారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ భోజనం కోసం వచ్చే వారికి రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగు బాయి గ్రూపు సభ్యులు శేఖర్, అనిల్ పాల్గొన్నారు.



# ‘ఫర్టిలైజర్ షాప్ యజమానులపై చర్యలు తీసుకోవాలి’

**మందమర్రి, జూలై 28 (ప్రభాత సమాచారం)** చెన్నూరు నియోజకవర్గంలో రైతులను నిలువు దోపిడి చేస్తున్న ఫర్టిలైజర్ షాప్, డిసిఎంఎస్ షాప్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జన సమితి నాయకుడు బచ్చలి ప్రవీణ్ కుమార్, నేషనల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జుమ్మిడి గోపాల్ లు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, చెన్నూరు నియోజకవర్గంలోని ఫర్టిలైజర్ షాప్, డిసిఎంఎస్ షాప్ యాజమానులు యూరియా, డిఏపి, ఎరువులను అధిక ధరలకు అమ్ముతూ, పేద రైతులను నిలువు దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. రైతులను దోచుకుంటున్న ఫర్టిలైజర్ షాప్, డిసిఎంఎస్ షాప్ యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే నియోజకవర్గం వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ గణపతి పాల్గొన్నారు.



# పులులకు ఆవాసం కాగజ్‌నగర్ 'అటవీ ప్రాంతం'..!



- ▪ వాతావరణ సమతుల్యతలో కీలకం
- ▪ రాకపోకలు తప్ప స్థిరంగా ఉండని వైనం
- ▪ కవ్వాల్‌కు పులి రాక ప్రశ్నార్థకమేనా?
- ▪ పులులకు ఆవాసం కాగజ్‌నగర్..
- ▪ తాజాగా 11కు చేరిన పులుల సంఖ్య
- ▪ పులుల బ్రీడింగ్ కేంద్రంగా కాగజ్‌నగర్
- ▪ నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

**అడవుల రక్షణలో పులుల పాత్ర కీలకం... వీటితో వాతావరణ సమతుల్యత కూడా ఆధారపడి ఉంది. అడవుల్లో పులులు ఉంటే దట్టమైన అడవులు పెరిగేందుకు దోహదపడుతాయి.** దీంతో సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండే అవకాశాలు ఉన్నాయి. పులి ఉంటే అడవులలోకి వెళ్లేందుకు భయపడటంతో అడవులకు రక్షణ ఏర్పడుతుంది. ఇలాంటి పులిని కొందరు స్వార్ధపరులు చంపి చర్మం, గోర్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మనిషి మనుగడకు, పులి సంచారానికి సంబంధం ఉన్నందున పులి రక్షణ అందరి బాధ్యత. నేడు ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

- ▸▸ కారిడార్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్రం ▸▸ రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపించిన అధికారులు
- ▸▸ 11కు చేరిన పులుల సంఖ్య ▸▸ తాజాగా మహారాష్ట్ర నుంచి మరో రెండు పులుల రాక
- ▸▸ పులుల బ్రీడింగ్ కేంద్రంగా కాగజ్‌నగర్

**కాగజ్‌నగర్, (ప్రభాత సమాచారం)** కాగజ్‌నగర్ అటవీప్రాంతం ఇప్పుడు పులులకు అవాసంగా మారింది. మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల మీదుగా కాగజ్‌నగర్ అటవీ ప్రాంతం కడంబాను ఆవా సంగా చేసుకొని పిల్లలను కనేందుకు వస్తు న్నాయి. కాగజ్‌నగర్ అటవీరేంజ్ పరిధిలో 2016లో మహారాష్ట్ర ప్రాంతం నుంచి మూడు పులులు వలస వచ్చాయి. ఈ ప్రాంతంలోనే ఉండేట్లు అధికారులు చర్యలు చేప ట్టారు. 2016లో ఫాల్గుణ అనే పులికి నాలుగు పిల్లలు పుట్టాయి. వీటి సంరక్షణ కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఫలితంగా నాలుగు పిల్లులు బతికాయి. ఇప్పుడు రెండో ఈతలో కూడా మళ్లీ నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. దీంతో మొత్తం 11 పులులు ఉన్నట్టు నిర్ధారణకు వచ్చారు. జిల్లాలో ఎక్కడలేని విధంగా ఈ ప్రాంతంలో పులులకు చక్కటి ఆవాసం ఉండే ట్టు అవకాశాలుండటంతోనే పులుల సంఖ్య పెరుగుతోం దని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు పూర్తిస్థాయిలో నివేదికలను పం పించారు. వీటి విషయంలో టైగర్ మాని టరిం గ్ టీం అధికారులు స్వయంగా కాగజ్‌నగర్ మండలంలోని కడంబా అటవీ ప్రాంతాన్ని జల్లె డ పట్టారు. చక్కటి బ్రీడింగ్ కేంద్రంగా ఉన్నట్టు నిర్ధారించటంతో కారిడార్ కోసం రూ.5 కోట్ల నిధులను కేటాయి స్తున్నట్టు పేర్కొంటున్నారు.

**ఇదీ అసలు నేపథ్యం..**

మహారాష్ట్ర-తెలంగాణ సరిహ ద్దున ఉండే ప్రాణహిత నది పరివా హక ప్రాం తాల గుండా పులులు ఆవాసం చేసుకునేందుకు అవకా శాలు ఎక్కువగా ఉన్నాయి. 2015 నుంచి 2016లో మూడు పులులు వచ్చాయి.

కాగజ్‌నగర్ అటవీరేంజ్ పరిధి లోని కడంబా, పెంచికల్‌పేట, బెజ్జూరు మండలాలతోపాటు పలు దట్టమైన అటవీ ప్రాంతాల్లో గుట్ట లున్నాయి. ఈ గుట్టలకు ఎవరూ పోలేని విధంగా ఉంటాయి. ఇలా పది కేంద్రాలున్నట్టు అధికారులు అంచనాలు రూపొందించారు. 2016లో కడంబా అటవీ ప్రాంతంలో గుట్టలపై ఫాల్గుణ నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. 2018లో మళ్లీ రెండో ఈతలో ఏకంగా నాలుగు పిల్లలకు జన్మని చ్చింది. దేశవ్యాప్తంగా ఈ పులికి గుర్తింపు రావటంతో వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ సిబ్బంది,. టైగర్ మాని టరింగ్ అధికారి, ఎఫ్‌డీఓ ముత్యాల రాజ రమ ణరెడ్డి పులుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తొలుత ఆవాసంతో పాటు బ్రీడింగ్ కేంద్రానికి అనువుగా ఉండేట్టు చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా వేసవిలో పులుల సంర క్షణకు తీసుకుంటున్న చర్యల కారణం గానే బ్రీడింగ్ కేంద్రంగా మారినట్టు తెలు స్తోంది. వాటి తాగునీటి కోసం సహజసిద్ధమైన ఊటలను వంద వరకు ఏర్పాటు చేశారు. అలా గే ప్రత్యేక కుంటలు 10, సోలార్ విద్యుత్ మో టారుతో నడిచే కుంటలను ఏర్పాటు చేశారు. ఫలితంగా పులులకు ఆవాసంగా మారాయి. కాగజ్‌నగర్ అటవీ డివిజన్ 884 ఎకరాల్లో విస్తరించి ఉంది.



ఎద్దును చంపి మాంసాన్నితింటున్న పులులు(ఫైల్)





పోస్టల్ స్టాంప్‌పై ఫాల్గుణ పులి

**పులుల దినోత్సవం నేపథ్యం..**

పులి సంరక్షణ కోసం ప్రజల్లో అవగహన కల్పిం చాలని 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బార్గ్‌లో జరిగిన టైగర్ సమ్మిట్‌లో ప్రపంచంలోని 13 దేశాలు పాల్గొన్నాయి. ప్రతి సంవత్సరం జూలై 29న గ్లోబల్ టైగర్ డేగా ప్రకటించి పులి విశిష్టత గురించి వివరించాలని నిర్ణయించాయి. అప్పటి నుంచి జూలై 29న అంతర్జాతీయ దినోత్సవం జరుపుతున్నారు.





కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో సహజ సిద్ధమైన నీటి ఊటలను ఏర్పాటు చేస్తున్న అధికారులు

## పులి కోసం అంతా సిద్ధం..

- ▸▸ పులి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు
- ▸▸ కవ్వాల అభయారణ్యంలో కొనసాగుతున్న పనులు
- ▸▸ ఉమ్మడి జిల్లాలో పెరిగిన పులుల సంఖ్య
- ▸▸ టైగర్‌జోన్‌లోని గిరిజనులకు పునరావాసం కల్పించాలి
- ▸▸ నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

**జన్నారం, ప్రభాత సమాచారం** వన్య ప్రాణులన్నింటిలో పులికి ప్రాధాన్యం ఉంది. ప్రకృతి సమతుల్యం చెందాలంటే పులుల అవసరం ఎంతైనా ఉంది. నానాటికి పులులు అంతరించి పోతున్నాయి. వరల్డ్ వైల్డ్‌లైఫ్ గణాంకాల ప్రకారం ప్రపంచంలో 97శాతం పులులు అంతరించాయని పేర్కొ న్నారు. పులులను వేటాడటంతోపాటు అవి స్వేచ్ఛగా జీవించే ఆవాసం లేక మృత్యువాత పడుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పులులపై చేసిన సర్వేలో 2014 నాటికి 4వేలకు పైగా పులులు ఉండగా అందులో దేశంలో 600ల కు పైగా పులులు ఉన్నట్లు సర్వేలు తెలుపుతున్నాయి. దేశంలో 48 టైగర్‌జోన్‌లు ఉండగా జన్నారం టైగర్‌జోన్‌ను 49వ టైగర్ జోన్‌గా ఏర్పడ్డాయి. 2016-17 లెక్కల ప్రకారం పులుల సంఖ్య 3400లకు పడిపోయింది. ప్రపంచ వ్యాప్తం గా నానాటికీ పులు ల సంఖ్య తగ్గుతుందే తప్ప పెరగక పోవడం గమనార్హం. ప్రపంచ దేశాలు పులుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేప డుతున్నప్పటికీ ఫలితాలు మాత్రం అంతంత మాత్రంగానే కని పిస్తున్నాయి. దేశంలో పులుల కోసం ప్రత్యేకంగా శ్రద్ధ కనబ రచడంతో మన దేశంలోనే పులుల సంఖ్య ఎక్కువగా ఉందని లెక్కలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న 49 పులుల సంర క్షణ కేంద్రాల్లో పులికి మనుగడ లేక పక్క ప్రాంతాలకు వెళ్లడం, లేక గ్రామ శివారులకు వెళ్లడంతో ముఖ్యంగా ప్రజలు భయాం దోళనకు గురై హతమార్చడం, నీటి కోసం వెళ్లి బావుల్లో పడి మృతి చెందడం, లేక పంట చేనులకు అమర్చిన విద్యుత్ తీగల కు బలి అవుతున్నాయి. మరోవైపు వేటగాళ్లు పులి చర్మం కోసం వీటిని వేటాడడం మరో ఎత్తుగా మారింది. వేటగాళ్లు హతమా ర్చిన సంఘటనలు, ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘ టనలున్నాయి.

### పులి సంరక్షణకు ప్రత్యేక చర్యలు..

కవ్వాల అభయారణ్యాన్ని ఏప్రిల్ 10, 2012లో కవ్వాల టైగర్ జోన్‌గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. దీంతో నాటి నుంచి నేటి వరకు పులి సంరక్షణ కోసం అధికా రులు చర్యలు చేపడుతున్నారు. టైగర్ మానిటరింగ్ బృందాలచే పులిసంరక్షణ, అనువైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యం గా కవ్వాల అభయా రణ్యంలో గతంలో నీటి జాడలకు కరువు ఉండేది. టైగర్ జోన్ ఏర్పడ్డ తర్వాత ప్రతీ స్క్వేర్ కిలోమీటర్‌కు నీటి ఊటలు, నీటి కుంటలు, సాసర్‌వెల్‌లు ఏర్పాటు చేశారు. నాలు గేండ్లలో పూర్తిస్థాయిలో వన్యప్రాణులను కాపాడుకు నేం దుకు నీటి వనరులను ఏర్పాటు చేశారు. దీంతోపాటు అభ యారణ్యంలో గడ్డి క్షేత్రాల ఏర్పాటుతో పాటు రక్షణ వలయాల ను ఏర్పాటు చేస్తూ నిఘా వ్యవస్థను పటిష్ట పరుస్తున్నారు.

### కవ్వాలలో నిలువని పులి..

కవ్వాల టైగర్‌జోన్ ఏర్పడ్డ తర్వాత 2014లో మల్యాల, దొంగ పల్లి అటవీ ప్రాంతంలో పులి జాడలను అటవీశాఖ అధికారు లు కనుగొన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అడపాదడపా వస్తూ పోతుందే తప్ప దట్టమైన అటవీ ప్రాంతంలో పులి నిలు వలేకపోయింది.

### ఉమ్మడి జిల్లాలో పెరిగిన పులులు..

ఉమ్మడి జిల్లాలో నీల్వాయి, కోటపల్లి, కాగజ్‌నగర్ అట వీ ప్రాంతంలోనే పులులు అడపాదడపా కనిపించేవి. టైగర్ కారిడార్ ఏర్పాటుతో అధికారుల అంచనాల ప్రకా రం ఉమ్మడి జిల్లాలో పులులు పెరిగాయి. చెన్నూర్, ఆసి ఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ అటవీ ప్రాంతంలో పులులు సంచరిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. చెన్నూర్, ఆసిఫాబాద్ అటవీ ప్రాంతాల్లో ఉన్న పులులు స్థిర నివాసం ఏర్పరచుకొన్నట్లు అధికారులు చెబుతున్నారు.

### అలికిడితో నిలువని పులి..

మహారాష్ట్రలోని తడోబా పులుల సంరక్షణ కేంద్రంలో పులుల సంఖ్య పరిమితికి మించడంతో కవ్వాల అభయా రణ్యం పులులకు అనువైన ఆవాసంగా ఉంటుందని భా వించి పులుల సంరక్షణ కేంద్రంగా ఏర్పాటు చేశారు. తడో బా, ఇంద్రావతి పులుల సంరక్షణ కేంద్రాల నుంచి పెను గంగ ప్రాంతం నుంచి కవ్వాల అభయారణ్యానికి పులులు వచ్చే దిశగా కారిడార్‌ను ఏర్పాటు చేశారు. రెండు సంవ త్సరాల పాటు ఒక్క పులి రాలేదు. అభయారణ్యంలో అధి కంగా ఆదివాసీ గూడాలు, గిరిజన గ్రామాలు ఉండడంతో అలికిడి అధికమైంది. దీంతో ఈ కారిడార్‌కు మధ్యలో మైదాన ప్రాంతం అధికంగా ఉండడం వల్ల పులులు వచ్చి నట్లే వచ్చి అలికిడికి వెళ్లిపోతున్నట్లు అధికారులు గుర్తిం చారు. టైగర్‌జోన్‌లోని జన్నారం డివిజన్‌లో గల మల్యాల, అల్లినగర్, దొంగపల్లి, నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ డివి జన్‌లో గల గండిరాంపూర్, మైసంపేట, గ్రామాలను తరలించాలని నిర్ణయించారు.

### పులి ఆహారం కోసం ప్రత్యేక ఏర్పాట్లు..

కవ్వాల టైగర్‌జోన్ ఏర్పడ్డ తర్వాత అటవీ ప్రాంతాన్ని 892 చ.కిమీల భాగాన్ని కోర్ ఏరియాగా, 1123 చ.కిమీల భాగాన్ని బఫర్ ఏరియాగా విభజించారు. కోర్ ఏరియాలో పూర్తి అటవీ ప్రాంతం అందులో ఎప్పటికప్పుడు అధికారులు అభివృద్ధి పనుల ను చేపడుతున్నారు. ముఖ్యంగా పులులు ఏకకాలంలో వస్తే వాటికి ఆహారం అనువుగా ఉంటేనే పులులు నిలుస్తాయని భావించిన అధికారులు వాటికి శాఖాహార జంతువుల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టారు. కవ్వాల అటవీ ప్రాంతం కోర్ ఏరియాలో గడ్డి క్షేత్రాల పెంపు మొదలుపెట్టారు. దీంతో శాఖా హార జంతువుల సంఖ్య పెరిగింది. ప్రతీ స్క్వేర్ కిలోమీటర్‌కు 4 నుంచి 6 శాఖాహార జంతువులు ఉంటే పులి స్వేచ్ఛగా వేటాడే విధంగా ఉంటుందని ఆ దిశగా పనులను చేపట్టారు.

### పులి మానిటరింగ్ లేకనే నిలవడం లేదు..

కవ్వాల టైగర్‌జోన్‌లో పులిని సరియైన రీతిలో మానిట రింగ్ చేయలేకపోవడం వల్లనే నిలవడం లేదని ఆరోపణలు న్నాయి. గతంలో వచ్చిన పులులు జన్నారం, కడెం ప్రాం తంలో మృత్యువాత పడ్డట్లు ఆరోపణలున్నాయి. గతంలో లక్షెట్టిపేట, దండేపల్లి అటవీ ప్రాంతంలో తిరిగిన పులి వేట గాళ్ల ఉచ్చులో పడిందని ఆరోపణలు వెలువెత్తాయి. పులి మానిటరింగ్ సరియైన రీతిలో ఉంటే కాపాడు కోవ చ్చని విశ్లేషకులు తెలుపుతున్నారు.



కవ్వాల అభయారణ్యంలోని వన్య ప్రాణులు







### గరోగులకు ఇబ్బందులు కలుగకుండా

# వైద్యసేవలందించాలి

### రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్

**మంచిర్యాల, జూలై 28 (ప్రభాత సమాచారం)**

ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లాలోని లక్షెట్టిపేట సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఓం సాయి ప్రైవేట్ ఆసుపత్రిని, మందమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, బెల్లం పల్లిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలను రాష్ట్ర టీం సభ్యులు శ్రీనివాస్, జితేందర్‌తో కలిసి తనిఖీలు చేశారు. ఆసుపత్రులలో వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయి, వైద్య సదుపాయాలు, సంక్రమణ వ్యాధులు, కీటక జనిత వ్యాధులు, వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలు, వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా, అందుబాటులో ఉంటున్నారా, ఆసుపత్రులలో సరిపోయే విధంగా మందులు అందుబాటులో ఉన్నవి, లేనివి, ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన నిధులు, వాటి వివరాలు, వైద్యులు, వైద్య సిబ్బంది ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, ఆహారం, సిబ్బంది ద్వారా ఎలాంటి సమస్యలైనా ఏర్పడుతున్నాయా, ఇంకా ఎలాంటి చికిత్సలు కావాలని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మానవతాధృక్పతంతో సేవలు అందించాలని ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన సూచించారు.

**పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి**

జిల్లా ఆసుపత్రిలో తిరిగినప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డాక్టర్ అజయ్ కుమార్ సిబ్బందికి ఆదేశించారు. రోగుల వివరాలను రోజువారిగా నమోదు చేయాలని, డెంగీ, చికెన్ గున్యా లాంటి వారి వివరాలను వెంటనే డీఎం అండ్ హెచ్ఓకు తెలియజేయాలన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల వివరాలు, వారి అటెండెన్స్, ప్రస్తుతం పని చేస్తున్న వైద్యుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఓం సాయి ప్రైవేట్ ఆసుపత్రిని సందర్శించి అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో స్ట్రెక్చర్లు, వీల్ చేర్లు, రోగుల నుంచి తీసుకుంటున్న డబ్బుల వివరాలు తెలుసుకున్నారు. మందమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు వైద్య సిబ్బంది ద్వారా అందిస్తున్న వైద్య సేవల పైన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలలో బృంద సభ్యులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిచంద్ర రెడ్డి, ఆర్ఎంఓలు, డిపిఓ ప్రశాంతి, డిపిహెచ్ఎల్ పద్మ, సుమన్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, ఎంటిఎస్ సంతోష్, వెంకట సాయి, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**వంద పడకల ఆసుపత్రి తనిఖీ...**

**బెల్లంపల్లి :** బెల్లంపల్లిలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం ఆరోగ్య వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వైద్య సేవలపై వాకబు చేశారు. మలేరియా, డెంగ్యూ విష జ్వరాల నియంత్రణకు ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య సేవలను సమర్థయంతో అమలు చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రిని నిత్యం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట డి సి హెచ్ ఎస్ కోటేశ్వరరావు, ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ జి.రవి వైద్యులు, వైద్య విధాన పరిషత్ అధికారులున్నారు.

### అర్హులైన వారందరికీ

## రేషన్ కార్డుల పంపిణీ



**నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులను అందించే బాధ్యత నాదేనని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భరోసా కల్పించారు. సోమవారం నిర్మల్ మండలం 1050 ఎఫ్ఎస్‌సి కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా 5 కిలోల ఉచిత బియ్యాన్ని అర్హులైన వారికి అంద జేస్తున్నదన్నారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మహమ్మద్ జమాల్, వెంకట్ రెడ్డి, ఆర్డీఓ రత్న కళ్యాణి పాల్గొన్నారు.

## ప్రతీ ఇంట్లో ఐదు మొక్కలు నాటేలా ప్రణాళిక



**నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని అన్ని వార్డులలో ప్రతి ఇంట్లో ఐదు మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించుకొని ముందుకు వెళ్తున్నామని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ సోమవారం పేర్కొన్నారు. 100 రోజుల గృహ అవసరాల మొక్కల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. వార్డుల వారీగా సిబ్బంది ప్రతిరోజూ మొక్కలను ఇంటింటికి వెళ్లి అందజేస్తున్నారని చెప్పారు.

## సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

**ఆసిఫాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం సిర్పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన రేషన్ కార్డులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విట్టల్ ,అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభు త్వం అర్హులైన వారికి సంక్షేమ పథకాలను మంజూరు చేస్తుందని వాటిని సద్వినియో గం చేసుకోవాలని తెలిపారు. పర్యటనలో భాగంగా పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులను సందర్శించారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని. ఎరువులను పక్కదారి పట్టిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసిల్దార్ మోహినుద్దీన్, ఏడిఏమనోహర్ తదితరులు పాల్గొన్నారు.



### కేకే ఓసిపి కార్మికులకు త్వరలో

## హెచ్ఆర్ఏ చెల్లింపు

### ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్

**మందమర్రి, జూలై 28 (ప్రభాత సమాచారం)**

ఏరియాలోని కేకే ఓసిపి కార్మికులకు రావాల్సిన ఇంటి అద్దె(హెచ్ఆర్ఏ) చెల్లింపుపై గత స్ట్రక్చరల్ సమావేశంలో యాజమాన్యంతో మాట్లాడి ఒప్పించడం జరిగిందని గుర్తింపు సంఘం ఏఐటియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షులు భీమనాథుని సుదర్శన్ తెలిపారు. సోమవారం కేకే ఓసిపిపై యూనియన్ పిట్ కార్యదర్శి మర్రి కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వార సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంకేతిక కారణాలతో హెచ్ఆర్ఏ చెల్లింపు ఆలస్యం అవుతుందని త్వరలోనే కార్మికులకు చెల్లించడం జరుగుతుందన్నారు. సింగరేణికి గత ఆర్థిక సంవత్సరం 2024-25 లో వచ్చిన వాస్తవ లాభాల నుండి కార్మికులకు 35 శాతం లాభాల వాటా ఇప్పించడానికి యూనియన్ కేంద్రనాయకత్వం యాజమాన్యంతో చర్చించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పెర్క్స్ పై ఐటి రద్దు చేయాలని, కార్మికులకు సొంతింటి పథకం కల్పించాలని యూనియన్ నాయకత్వం కృషి చేస్తుందన్నారు. గత పది సంవత్సరాలుగా స్ట్రక్చరల్ సమావేశాలు లేవని, ఏఐటీయూసీ గెలిచిన అనంతరం ఏరియాలో జిఎం స్థాయి స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహించి, ఏరియాలోని పలు సమస్యలను యాజమాన్యంతో మాట్లాడి, పరిష్కరించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ అసిస్టెంట్ కార్యదర్శి కంది శ్రీనివాస్, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జెట్టి మల్లయ్య, బ్రాంచ్ నాయకులు రాజేశ్వర్, బానయ్య, కేకే 5 గని పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ కుమార్, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ గోపతి సత్యనారాయణ, సీనియర్ నాయకులు ముద్దసాని కోటయ్య, ఓసిపి అసిస్టెంట్ పిట్ కార్యదర్శి రాజేష్ యాదవ్, షిఫ్ట్ ఇంచార్జ్ పల్లపు మల్లేష్, ఓసిపి మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీ నేతలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

### బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

హైడ్రా కూల్చివేతల సమయంలో... ఇచ్చిన హామీలను నెరవేర్చని సీఎం రేవంత్ రెడ్డిని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, మహిళలు అనరాని మాటలు అంటూ శాపనార్ధాలు పెట్టా రని, ప్రజలతో ఇన్ని తిట్లు తింటున్న ఇలాంటి థర్డ్ క్లాస్ ముఖ్యమంత్రిని రాష్ట్ర ప్రజలు ఎన్నడూ చూడలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మరో వైపు సమస్యలు తీర్చమని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వద్దకు వెళ్లిన ప్రజలతో ప్రభుత్వం మనది లేదని మాట్లాడి చేతులు దులుపుకోవడం ఎమ్మెల్యే పని కాదని పేర్కొన్నారు. సోమవారం సాత్నాల మం డలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నేతల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని ధ్వజమెత్తారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని జోగు రామన్న పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత హామీలను స్థానిక సంస్థల ఎన్నికల ఓట్లతో బుద్ధి చెప్పాలన్నారు.. గత ప్రభుత్వ బీఆర్ఎస్ హయాంలో ప్రతి మరుమూల గ్రామాలకు కోట్ల రూపాయలు వెచ్చించి కమిటీ హాలు, రైతు వేదికలు, గ్రామ రోడ్ల నిర్మాణాలతో పాటు స్కూల్లో పునరుద్ధరణ, ఆలయాల నిర్మాణాలు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలపై వివక్షన కొనసాగిస్తూ మహిళలకు అందాల్సిన 2500 పెన్షన్‌తో పాటు తులం బంగారం, 500 గ్యాస్ అని ప్రలోభాలకు గురి చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ లు యాసం నర్సింగ్ రావు, మెట్టు ప్రహ్లాద్, నాయకులు దేవన్న, బుచ్చన్న, వేణు గోపాల్ యాదవ్, ఉగ్గే విట్టల్ పాల్గొన్నారు.



## చెప్తే నమ్మేలా ఉండాలి.

ప్రముఖ టీవీ యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన అనసూయ భరద్వాజ్ ఇప్పుడు వెండితెరపై తనకంటూ ఓ స్పెషల్ ప్లేస్ ను సంపాదించుకుంది. 'రంగస్థలం', 'పుష్ప', 'పుష్ప 2', 'ప్రేమవిమానం', 'రజాకార్' వంటి సినిమాల్లో తన నటనతో ఆకట్టుకున్న ఆమె ప్రస్తుతం తమిళ చిత్రాలు 'ఫ్లాష్‌బ్యాక్', 'వోల్ఫ్' లో నటిస్తోంది. సినిమాల ఆఫర్లు పెరగడంతో టీవీకి గుడ్‌బై చెప్పి ఫుల్‌టైమ్ మూవీ ఆర్టిస్టుగా మారింది. అయితే సినిమాలతోపాటు అనసూయ సోషల్‌మీడియాలో కూడా తరచూ వార్తల్లో నిలుస్తుంటుంది. ముఖ్యంగా విజయ్ దేవరకొండపై గతంలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో విజయ్ ఫ్యాన్స్ ఆమెను టార్గెట్ చేస్తూ ట్రోల్ చేస్తున్నారు. 40 ఏళ్ల వయస్సులో కూడా తనకు 'ఆంటీ' అనే పిలుపు నచ్చదని అనసూయ చాల సందర్భాలలో చెబుతున్నా సరే, నెటిజన్లు మాత్రం అదే పదంతో ఆమెను రెచ్చగొడుతున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ ట్రోలింగ్ గురించి స్పందించిన అనసూయ, "ఎవరైనా అసభ్యంగా మాట్లాడితే నేను వారిని వెంటనే బ్లాక్ చేస్తాను. ఇప్పటివరకు సుమారు 3 మిలియన్ల మందిని బ్లాక్ చేశాను. ఇప్పుడు నాకు చాలా మనశ్శాంతిగా ఉంది" అంటూ చెప్పుకొచ్చింది. అయితే ఇప్పుడు ఈ వ్యాఖ్యలు కూడా కొత్త ట్రోలింగ్స్ కు దారితీశాయి. "ఇన్‌స్టాగ్రామ్‌లో 16 లక్షల ఫాలోవర్లు ఉన్న అనసూయ 30 లక్షల మందిని ఎలా బ్లాక్ చేస్తుంది?" అంటూ నెటిజన్లు ట్రోలింగ్ మొదలుపెట్టారు. కొందరు అనసూయ చెప్పేవన్నీ అవాస్తవాలు అంటూ ఫుల్ గా ట్రోల్ చేస్తున్నారు.



## చిన్న బడ్జెట్.. కోట్లు కొల్లగొట్టింది!



స్టార్ హీరోలు, భారీ బడ్జెట్, హీరోకు ఎలివేషన్స్ ఉన్న సినిమాలు మాత్రమే రికార్డులు సృష్టిస్తాయనుకుంటే అనుకుంటే పొరపాటే! ఇది ఒక్కప్పటి ట్రెండ్.. ఇప్పుడు ప్రేక్షకులు సినిమా చూసే విధానం పూర్తిగా మారింది. పెద్ద సినిమా అయినా, చిన్న సినిమా అయినా కంటెంట్ ఉంటేనే ఆదరిస్తున్నారు! అలాంటి సినిమానే 'చౌర్య పాఠం'. చిన్న సినిమాగా విడుదలైన ఈ చిత్రం థియేటర్స్ పెద్దగా సందడి చేయకపోయినా.. ఓటీటీలో మాత్రం బ్రహ్మరథం పడుతున్నారు ప్రేక్షకులు. ఇటీవలే అమెజాన్ ప్రైమ్ లోకి వచ్చిన ఈ సినిమా రికార్డు వ్యూస్ తో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తాజాగా 200 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ మైలురాయిని దాటి సరికొత్త రికార్డును సృష్టించింది. కేవలం తెలుగులోనే కాకుండా హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ, హిందీ అన్ని భాషల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కామెడీ, క్రైమ్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని కథను అందించగా.. నిఖిల్ గొల్లమారి డైరెక్ట్ చేశారు. ఇంద్రరామ్, పాయల్ రాధాకృష్ణ హీరో హీరోయిన్లుగా నటించారు. ఇందులో కొత్త నటుడు హీరో ఇంద్ర రామ్ తన నటనతో ప్రేక్షకులను మెప్పించాడు. తన పాత్రలో ఒదిగిపోయి విమర్శకుల ప్రశంసలు పొందాడు. సినిమా తీయాలనే పిచ్చితో ఉన్న ఓ యువకుడి చుట్టూ 'చౌర్య పాఠం' తిరుగుతుంది. అయితే సినిమా తీయాలని కలలు కనే అతడికి డబ్బు లేకపోవడంతో ఒక దొంగతనం చేయాలని ప్లాన్ చేస్తాడు. నేరాలు లేని ఒక గ్రామంలోని బ్యాంకును దోచుకోవడానికి ప్లాన్ చేస్తాడు. దాని కోసం ఒక ముఠాను కూడా ఏర్పర్చుకుంటాడు. అయితే, ఈ దొంగతనాల ప్రయత్నంలో వారికి ఎదురయ్యే ఊహించని పరిణామాలు, హాస్య సన్నివేశాలు, సస్పెన్స్ సినిమాను ఆసక్తికరంగా మారుస్తాయి. ఈ దొంగతనం ప్రయాణం హీరో జీవితాన్ని ఎలా మారుస్తుంది అనేది సినిమా కథ.



## నెటిజన్ కామెంట్ కి నిధి దిమ్మతిరిగే రిప్లై..

తెలుగు తెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన నిధి అగర్వాల్, తాజాగా పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరి హర వీరమల్లు' లో హీరోయిన్‌గా మెరిసిన సంగతి తెలిసిందే. ఐదేళ్లుగా షూటింగ్ సాగిన ఈ సినిమా ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రస్తుతం మిక్సడ్ టాక్ తో నడుస్తోంది. సినిమాలో పవన్ కళ్యాణ్ ఎంట్రీ, యాక్షన్ సీన్‌లు, పాటలు, చార్మినార్ వంటి విజువల్స్ ఆకట్టుకున్నా, VFX క్వాలిటీపై విమర్శలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ముఖ్యంగా 2ND హాఫ్ లో కథ మెల్లగా సాగడమే కాకుండా గ్రాఫిక్స్ క్వాలిటీ ఆశించిన స్థాయిలో లేవంటూ ప్రేక్షకులు, అభిమానులు కొంత నిరాశ పడ్డారు. అయితే సోషల్ మీడియాలో నెటిజన్స్ సినిమా వీఎఫ్ఎక్స్ గురించి తీవ్రంగా కామెంట్లు చేస్తున్నారు. అయితే నిధి అగర్వాల్ మాత్రం సినిమా ప్రమోషన్లలో చురుగ్గా పాల్గొంటూ నిర్మాత ఏఎం రత్నాతో కలిసి థియేటర్‌కి వెళ్లిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. అయితే ఓ నెటిజన్ "సినిమా నాకు నచ్చలేదు" అంటూ కామెంట్ చేయగా, నిధి ఎంతో కూల్ గా "పర్లేదు అండి.. అన్‌బయాస్డ్‌గా చూసే వాళ్లకి సినిమా నచ్చుతుంది" అంటూ ఓ కూల్ కౌంటర్ ఇచ్చింది. ఆమె స్పందన ఇప్పుడు సోషల్ మీడియా లో వైరల్ అవుతోంది.

# సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

## ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్

సిర్పూర్ (టి), జూలై 28 (ప్రభాత సమాచారం)

పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారెంటీలను దశల వారీగా నెరవేరుస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో ఒక్క ఇల్లు, రేషన్ కార్డులు ఇవ్వలేదనిని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ వెంకటేష్‌దోత్రే మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్న బియ్యం అమ్ముకుంటే వారి రేషన్ కార్డులను రద్దు చేస్తామని హెచ్చరించారు. నూతనంగా మంజూరు అయిన 281 రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో గిరీష్, గణపతి పాల్గొన్నారు.





## నూతన రేషన్ కార్డుల పంపిణీ

కాసిపేట, జూలై 28 (ప్రభాత సమాచారం)

కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యత సీఎం రేవంత్ రెడ్డి ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ కాసిపేట మండల అధ్యక్షుడు ప్రదీప్ పేర్కొన్నారు. కాసిపేట మండలానికి చెందిన 380 మంది లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డులను సోమవారం తహసీల్దార్ భోజన్నతో కలిసి అందజేశారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, రానివాళ్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

## 'ఆంక్షలతో అభివృద్ధి ఆగిపోయింది'



జన్నారం, జూలై 28 (ప్రభాత సమాచారం)

కవ్వాల్ అభయారణ్యంలో విధించిన ఆంక్షలతో అభివృద్ధి ఆగిపోయిందని జన్నారం మండల అభివృద్ధి కమిటీ కన్వీనర్ ఎస్. కొండయ్య కోకన్వీనర్ కె. చంద్రయ్య తెలిపారు. సోమవారం జన్నారంలో వారు మాట్లాడుతూ ఆంక్షలు ఎత్తివేసి భారీ వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని దీక్షలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జన్నారంలో భారీ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కు వినతి పత్రం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### అక్రమ మానవ రవాణాకు
## వ్యతిరేకంగా పోస్టర్ల ఆవిష్కరణ



ఆసిఫాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)

జూలై 30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, శూర్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన పోస్టర్లను సోమవారం జనకాపూర్‌లోని బాలరక్ష భవన్‌లో డిసిపిఒ బుర్ర మహేష్ ఆవిష్కరించారు. ఆసిఫాబాద్ జిల్లాలో అవగాహన పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

## మొక్కలు నాటి బాధ్యతగా పెంచండి

నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)

ప్రతి విద్యార్థి పాఠశాలలో ఇండ్లలో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతలను తీసుకోవాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీనాయక్ అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని రామ్ నగర్ ఆశ్రమ బాలికల పాఠశాలలో మొక్కలు నాటారు. ఐటీడీఏ పరిధిలో అన్ని ఆశ్రమ గిరిజన పాఠశాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం జరు గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఫ్లైఓవర్‌పై కుంగిన రోడ్డు

### మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లిలో ఘటన



మంచిర్యాల, జూలై 28 (ప్రభాత సమాచారం)

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతన్‌పల్లి రైల్వే బ్రిడ్జిపై ఇటీవల నిర్మించిన ఫ్లైఓవర్‌పై వేసిన రోడ్డు సోమవారం రాత్రి కుంగిపోయింది. రామకృష్ణాపూర్ పట్టణం నుంచి మంచిర్యాల వైపునకు వెళ్లే దారిలో బ్రిడ్జిపై రోడ్డు కుంగిపోవడంతో పాటు ఫుట్‌పాత్‌పై పగుళ్లు ఏర్పడ్డాయి. రాత్రిపూట రోడ్డు కుంగడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. కాంట్రాక్టర్లు నాణ్యత పాటించకపోవడం, అధికారులు దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రోడ్డును బాగు చేయండి

### తుడుం దెబ్బ నాయకుల నిరసన

తిర్యాణి, జూలై 28 (ప్రభాత సమాచారం)

తిర్యాణి ప్రధాన రహదారిని బాగు చేయాలని తుడుం దెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. తిర్యాని మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద సోమవారం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాలకులు మారిన ప్రభుత్వాలు మారిన తిర్యాని మండల ప్రధాన రహదారి దుస్థితి మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాండూరు మండలం శ్రీ ఇంక్లైన్ నుండి తిర్యాణి వచ్చే ప్రధాన రహదారి గుంతల మయంగా మారి మండల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారనిఅన్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీళ్లు నిండి ప్రమాదాలు జరిగి అనేక మంది గాయాల పాలవుతు న్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, అధి కారులు, అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు భగవంతు రావు, పెందోర్ ధర్ము, కోట్నక గణపతి, జైనేని చంద్రశేఖర్ పాల్గొన్నారు.





## నియోజకవర్గంలో
# అభివృద్ధి పరుగులు

### బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

నెన్నెల, జూలై 28 (ప్రభాత సమాచారం)

ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే అజెండా పని చేస్తున్నామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. నియోజకవర్గంలో గతంలో కనివిని ఎరుగని అభివృద్ధి పనులు నడుస్తుండటమే అందుకు నిదర్శనమన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన రేషన్ కార్డుల మంజూరు పత్రాలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొదటి విడత బిల్లుల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దశాబ్దకాలంగా రేషన్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్న పేదల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సంతోషాన్ని నింపిందన్నారు. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, కార్డులు రాని వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తారని అన్నారు. నెన్నెల మండలానికి నిధుల మంజూరుకు రాజీ పడేది లేదని, అవసరమైన పనులకు అంచనాలు రూపొందించి ఇవ్వాలని కోరారు. అధికారులు, నాయకులు సమన్వయంతో పనులు చేయాలని సూచించారు. 221 మందికి కొత్త రేషన్‌కార్డుల మంజూరు పత్రాలు అం దజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోతి, ఎంపీ డీవో అబ్దుల్ హై, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, నా యకులు బొమ్మెన హరీష్‌గౌడ్, శ్రీనివాస్, మల్లాగౌడ్ పాల్గొన్నారు.

### అటవీ అధికారులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు...

అటవీ అధికారులు తమను వేధిస్తున్నారని నెన్నెల గిరిజనులు ఎమ్మెల్యే వినోద్‌కు ఫిర్యాదు చేశారు. పోడు భూముల్లో పంటలను ధ్వంసం చేస్తూ సాగును అడ్డుకుంటున్నారని అన్నారు. సోమవారం నెన్నెల మండల కేంద్రంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. నెన్నెల శివారు సర్వే నంబరు 672లో తమకు పట్టా లు ఉన్నాయని, దశాబ్దాల కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి, సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి పోడు సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు హరీష్‌గౌడ్ ఉన్నారు.

# గ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు కృషి



## నూతన జిల్లా చైర్మన్ నర్సయ్య

ఆదిలాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)

ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని గ్రంథాలయా లను డిజిటలైజేషన్ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన చైర్మన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. సోమవారం తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు శివ కుమార్ నేతృత్వంలో గజిటెడ్ అధికారుల సంఘం నేతలు జిల్లా చైర్మన్‌గా ఎన్నికైనందున నర్సయ్యను సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ నర్సయ్య మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం వారికి కావలసిన సిలబస్, సమాచారం అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లాలోని అన్ని గ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్, సంఘం కార్యదర్శి రామారావు, అసోసియేట్ అధ్యక్షులు ప్రవీణ్, ఉపాధ్యక్షులు రాజేష్, వామన్ రావు, అరుణ, సంయుక్త కార్యదర్శి అనిల్, కోశాధికారి శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.




# కలతలు తొలగించే నాగేంద్రుడు



నేడు నాగుల పంచమి.. శ్రావణ శుక్లపంచమి నాగారాధనకు శ్రేష్ఠమని గ్రామీణులు విశ్వసిస్తారు. అందుకే ఇతరత్రా పండు గల మా దిరి నాగపంచమిని కూడా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. భారతీయ సంప్రదాయా ల్లో మనుషులకు, నాగులకు అధిక ప్రాధాన్యత ఉం ది. అందుకే మహిళలు పాము పుట్టల్లో పాలు పోసి తమ భక్తిని చాటుకుంటారు. నవధాన్యాలతో తయారు చేసిన పుట్నాలను సైతం నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు మంగళవారం నాగుల పంచమిని భక్తి శ్రద్ధ లతో జరుపుకో నున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అక్కాచెల్లెళ్లు ఉయ్యాలలు ఊగుతూ ఎంతో ఆనందంగా గడుపుతారు. ఇది ఆనవాయితీగా వస్తున్న ఆచారం. నాగేంద్రుడు తనను భక్తి శ్రద్ధలతో పూజించిన వారి కలతలను తొలగించేవాడు. తనను నమ్మిన వారిని ఉద్ధరించే కరుణా సముద్రుడైన కనుక నాగుల పంచమి రోజు నాగేంద్రుడిని పూజించడం వారికి శుభాలు చేకూరుతాయని భక్తుల విశ్వాసం నాగుల పంచమి రోజు నియమంతో ఆచరించిన వారికి నాగేంద్రుని దయ ఉంటుందని భక్తులు విశ్వసిస్తారు. నాగపంచమి నోము నోచిన వ్రత ప్రభావం వలన భయాందోళనల తొలిగే సంతోషంగా ఉంటారని భక్తులు భావిస్తారు. పూర్వకాలంలో ఒకానొక గ్రామంలో లో ఒక ధనవంతురాలు ఉండేది ఆమెకు తన గర్వంగానే అహంకారం గాని లేని సుగుణవతి విద్య వినయం గల సౌజన్య రాలు పెద్దల పట్ల వినయ విధేయతలతో పని పట్ల కరుణ దయ సానుభూతి గల సద్గుణ సంస్కారాలు కలిగిన వ్యక్తి, ఈ గుణాలు కలిగిన ఆ వ్యక్తికి ఒక బాధ ఉండేది. చెవిలో చీము కారుతూ ఉండేది రాత్రులందు సర్పం కలలో కనబడుతూ కాటు వేయబోతుంది. ఉండేది అందువల్ల ఆమె మనసులో ఎంతో కలవరపడుతూ ఉండేది. ఆమెకు ఒకరోజు ఒక సాదు కలిసి ఇ తన బాధకు కారణం సర్ప దోషం వల్ల సంభవించిందని చెబుతాడు.. నాగుల పంచమి రోజు పూజ చేసినట్లయితే ఆ బాధ తగ్గుతుందని చెప్తాడు. ఏమి చేసినా నాగేంద్రునికి అనుగ్రహం నీకు సిద్ధిస్తుందని వ్యాధి భయాందోళనలు తొలగిపోతాయి. నీవు నాగుల పంచమి రోజు దగ్గరలో గల పుట్టలో పాలు పోసి నాగదేవతను పూజించాలని సూచిస్తాడు. నీవు గతజన్మలో నాగ పూజ చేసే వారిని ఆక్షేపణ చేయడం వలన నీకు ఆ విధంగా జరిగిందని చెప్తాడు. నాగదేవత పూజ చేసేటప్పుడు చులకనగా చూడడం చేయకూడదని సూచిస్తాడు. ఆమెకు ఎన్ని పూజలు చేసిన ఎన్ని శాంతులు చేయించిన కలలో కనబడడం కాటు వేయటం తగ్గలేదు తనకు కనబడిన వారందరికీ తన బాధలు చెప్పుకుంది తప్ప తన బాధ తీరలేదు. ఆ విధంగా సాధువు చెప్పడంతో ఆమె వెంటనే నాగుల పంచమి రోజు పుట్టలో పాలు పోసి ప్రత్యేక



పూజలు నిర్వహించింది. అప్పటినుండి ఆమెకు బాధలు తగ్గాయి. ఇంట్లో వెండి రాగి చెక్కలతో చేసిన నాగ పడి గెలను భక్తులు అభిషేకం చేస్తారు. దాని వలన సంతానం లేని వారికి సంతానం కలుగుతుంది. భార్యాభర్తలకు శుభం కలుగుతుంది. నాగుల పంచమి రోజు ప్రత్యేకంగా నాగ దేవతకు పూజలు చేస్తే శుభాలు కలుగుతాయి. నాగ దేవతారాధన జపం ప్రత్యేక పూజలు చేయడం వలన ఎన్నో శుభాలు జరుగుతాయని పండితులుసూచిస్తున్నారు. సాక్షాత్తు పరమేశ్వరుడే నాగపంచమి నాడు భక్తులు ఆచరించవలసి న విధులను పార్వతీదేవికి వివరించి నట్లుగా స్కాంద పురాణం చెప్తుంది. శివుని మెడలో ఆభరణంగా ఉండే నాగేంద్రుడిని పూజించడం హైందవుల ఆచారం నాగ పంచమి రోజున నాగప్రతిమకు పంచామృతము, జాజి సంపెంగ గన్నేరు వంటి పుష్పాలతో అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేసి పాయసం నివేదిం చాలని ముక్కంటి శక్తిమాతకు వివరించినట్లు పురాణాల ద్వారా తెలుస్తుంది. నాగేంద్రుడు దయామ యుడు తనను నమ్మిన వారిని ఉద్ధరించే కరుణా సముద్రుడు కనుక ఈ విషయాల పట్ల విశ్వాసం ఉంచి నాగ పం చమి రోజు నోము నోచి నట్లయితే కలతలు తొలుగు తాయి. భక్తిశ్రద్ధలతో వ్రత విధానం ఆచరించి నాగ పంచ మి రోజు వాయనాలు ఇచ్చుకోవడం కొన్ని ప్రాంతాల్లో ఉంది.

**నాగోబా ఆలయం ముస్తాబు...**

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పం డుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా ఆలయంలో మంగళవారం నిర్వహించే నాగుల పంచమి ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. రెండురోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావ్ తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగ కుండా అన్ని ఏర్పాట్లు చేయ డంతో పాటు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. నాగుల పంచమి పురస్క రించుకొని వాలీబాల్, కబడ్డీ క్రీడాపోటీలు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. సీఐ మడావి ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.











## లీమ్‌గూడ శివారులో

# చిరుత సంచారం

**తాంసి, జూలై 28 (ప్రభాత సమాచారం)**

మండలంలోని లీమ్‌గూడ శివారులో చిరుతపులి సంచారంతో స్థానికులు భయాం దోళనకు గురవుతున్నారు. లీమ్‌గూడ గ్రామానికి చెందిన రైతు కుమ్రం సూరజ్ ఆదివారం సాయంత్రం అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న పంటచేనులో పశువులు మేపుతుండగా చిరుతపులి ఒక్కసారిగా లేగదడపై దాడిచేసింది. రైతుతో పాటు అక్కడే ఉన్న కుక్క గట్టిగా అరవడంతో చిరుతపులి అక్కడి నుంచి పారిపోయింది. వెంటనే రైతు లేగదూడను గ్రామంలోకి తీసుకొచ్చి గ్రామస్తులకు విషయం తెలియజేశాడు. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా సోమవారం అటవీ సెక్షన్ అధికారి అహ్మద్ ఖాన్ సిబ్బందితో కలిసి చిరుతపులి గాయపర్చిన లేగ దూడను, చిరుతపులి సంచరిస్తున్న అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. పంట చేనులో చిరు తపులి సంచరించినట్లుగా పాదముద్రలు లభించ లేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బీట్ అధికారి సాయి కుమార్, శరత్ రెడ్డి ఉన్నారు.

# యువకుడి ఆత్మహత్య

**కెరమెరి, జూలై 28 (ప్రభాత సమాచారం)**

కెరమెరి మండలంలోని దేవుడ్‌పల్లి గ్రామానికి చెందిన జాడి నవీన్ (24) ఉరివేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.. మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# వృద్ధుడిపై ఆవు దాడి

**బోథ్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో సోమవారం 14వ వార్డుకు చెందిన వృద్ధుడిపై ఆవు దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలైన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాథోడ్ విట్టల్ అనే వృద్ధుడి పై ఆవు దాడి చేయడంతో అతని చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు, కుటుంబీ కులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వృద్ధుని పై ఆవు దాడి చేయడం వల్ల గ్రామంలో ఊరు మీద వదిలిపెట్టిన ఆవులు విచ్చలవిడిగా తిరుగు తుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

## కులం పేరుతో దూషించిన

# ఐదుగురికి 6 నెలల జైలు శిక్ష

**ఆదిలాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

కులం పేరుతో వ్యక్తిని దూషించిన ఐదుగురికి ఆరు నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. బేల మండలం టాక్లి గ్రామానికి చెందిన కనక మారుతి 2023 జూన్ 13న జునుగురే నరేంద్ర చేను కౌలుకు తీసుకున్నాడు. చేనులో విత్తనాలు వేస్తుండగా అదే గ్రామానికి చెందిన బండేకర్ సాకారం, శంకర్, మంగేశ్, తేజస్, మంగల కలిసి కనక మారుతిని విత్తనాలు వేయకుండా అడ్డుపడ్డారు. అతనిని కొట్టి, కులం పేరుతో దూషిం చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై బేల పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. వాదనల అనంతరం నిందితులకు 6 నెలల జైలు శిక్ష విధిస్తూ ఆదిలాబాద్ స్పెషల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కుమార్ వివేక్ సోమవారం తీర్పు వెలువరించారు.

# మత్తు ఇంజక్షన్లు సరఫరా ముఠా అరెస్టు

## వివరాలు వెల్లడించిన నిర్మల్ జిల్లా ఏఎస్పీ రాజేష్ మీనా

**నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలో యువత మత్తుకు బానిస కావడంతో వారి అవసరాలను ఆసరా చేసుకుని అందుకు నిషేధిత గుట్కా లైసెన్స్ లేని మత్తు ఇంజక్షన్లు గంజాయిని విక్రయిస్తున్న ముఠా సభ్యులను సోమవారం అరెస్టు చేసినట్టు జిల్లా ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు ఏఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిర్మల్ పట్టణం చెందిన షేక్ మతీం మహమ్మద్ పర్వేజ్ షేక్ సోనోమన్ అనే నలుగురు యువకులు నిర్మల్ పట్టణంలో గంజాయితోపాటు రోగులకు వినియోగించే మత్తు ఇంజక్షన్ కొనుగోలు చేసి నిషాకోసం ఇతరులకు వికరిస్తున్నట్టు తెలిపారు. ఆపరేషన్ల సమయంలో వినియోగించే మిఠాపిన్ టర్మాటిక్ సల్ఫేట్ ఇండక్షన్ లైసెన్స్ లేకుండా కొనుగోలు చేసి మత్తు పదార్థాలకు బానిసైనా యువకులకు ఇంజక్షన్ల రూపంలో సర ఫరా చేస్తున్నట్లు విచారణ తేలింది అన్నారు. పోలీసులకు సమాచారం రావడంతో వారిని అదుపులో తీసుకొని విచారించగా నేరం కూడా జరిగిందని వారి వద్ద నుంచి మూడు మత్తు ఇంజక్షన్లు మూడు సీరేంజరులు 100 గ్రాముల గంజాయి ఒక ఆటో నాలుగు ఫోన్లు స్వాధీన పరుచుకున్నట్టు తెలిపారు మత్తు పదార్థాలు ఇంజక్షన్లపై పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిఘా పెట్టడంతో ముఠా సభ్యులను పట్టుకోవడం జరిగిందని, మత్తుకు బానిసైన ముగ్గురు మియాజుద్దీన్ రాజశేఖర్ గణేష్‌లను బైండోవర్ చేసినట్టు ఆయన వివరించారు. మత్తు ఇంజక్షన్లతో వ్యాపారం చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



# నేరాల కట్టడికే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

**మామడ, జూలై 28 (ప్రభాత సమాచారం)**



నేరాల కట్టడి కోసమే (కార్డెన్ సెర్చ్) కమ్యూనిటీ కాంటక్ట్ ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని ఏ ఎస్ పి రాజేష్ మీనా అన్నారు. సోమవారం మండలంలోని కమల్ కోట్ గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి పోలీసులు వెళ్లి కుటుంబం సభ్యుల వివరాలపై ఆరా తీశారు. నెంబర్ ప్లేట్, సరైన పత్రాలు లేని 70 ద్విచక్ర వాహనలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌పి మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసు కుంటామని ఆయన పేర్కొన్నారు. గంజాయికి ప్రజలు దూరంగా ఉండాలని, గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు జరగకుండా నిఘా నేత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సోన్ సిఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సైలు అశోక్, గోపి శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి మృతి

**ముథోల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**



మండలంలోని దేగాం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కుభీర్ మండలం గోడాపూర్‌కు చెందిన గర్కే ప్రవీణ్ (32) పని నిమిత్తం నిజామాబాద్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆదివారం రాత్రి తన ద్విచక్రవాహ నంపై భైంసాకు వస్తుండగా భైంసా నుంచి బాసర వైపునకు వెళ్తున్న ఆటో ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమా దంలో తీవ్రగాయాలపాలైన ప్రవీణ్ అక్కడిక క్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై వెల్లడించారు.

## యువకుడి ఆత్మహత్య

**దస్తూరాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**



పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇన్చార్జి ఎస్‌హెచ్ దైవకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నీరటి నరేశ్ (23)కు ప్రవలికతో మూడు నెలల క్రితం వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య సఖ్యత లేకపోవడం.. భార్య ప్రవళిక అనారోగ్యం తో పుట్టింటి వద్దనే ఉండటంతో మనస్తాపం చెందిన నరేశ్ శనివారం పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్ ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నరేశ్ మృతి చెందాడు.

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

**లక్షెట్టిపేట, జూలై 28 (ప్రభాత సమాచారం)**



లక్సెట్టిపేట మండలంలోని అంకతిపల్లి గ్రామానికి చెందిన మౌనిక (29) అనే వివాహిత పురుగుల మందుతాగి ఆత్మ హత్యకు యత్నించగా సోమవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మౌనికకు హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన సింగరేణి ఉద్యోగి మహేశ్ ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల పాప, ఏడాది బాబు ఉన్నారు. ఈక్రమంలో గత రెండు నెలల నుంచి తల్లిగారింటి వద్దే ఉంటున్న మౌనిక ఈనెల 24న ఇంటి ఆవరణలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడే ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆత్మ హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## మనస్తాపంతో యువకుడు...

**మంచిర్యాల, జూలై 28 (ప్రభాత సమాచారం)**

జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. ఏఎస్సై వెంకన్న గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్ మండలం శీలపల్లి గ్రామానికి చెందిన బూసినేని బాలకృష్ణ (26) డిగ్రీ పూర్తి చేసి పని లేకుండా ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈక్రమంలో పని చూసుకునేందుకు హైదరాబాద్‌కు వెళ్తానని చెప్పి ఈనెల 25న ఇంటి నుంచి బయలుదేరాడు. 26న రాత్రి రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద గుర్తు తెలియని పురుగుల మందు తాగి కు టుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలింగా అక్కడే మృతి చెందాడు.



## రోడ్డు ప్రమాదంలో

# ఉపాధ్యాయుడి మృతి

**ముథోల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**



రోడ్డు ప్రమాదంలో ముథోల్ ఆశ్రమ పాఠశాల పీఈటీ ఆడే నరేష్ మృతి చెందిన ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కుభీర్ మండలం సిర్పెల్లి తాండకు చెందిన ఆడే నరేష్ (45) ముథోల్ నియోజకవర్గ కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలోనే తన ద్విచక్ర వాహనం పాఠశాలకు వెలుతుండగా నిజామాబాద్ వైపు నుంచి భైంసాకి వస్తున్న బస్సు సేవాలాల్ చౌక్ సమీపంలో బైక్ ను ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాల పాలైన నరేష్‌ను 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించగా... అప్పటికే ఆయన మృతి చెందినట్లుగా తెలిసింది. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

## కుక్కల దాడిలో గొర్రెలు మృతి

**ఆదిలాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

మండలంలోని యాపల్గూ డకు చెందిన పశుపోషకుడు లయరీ కిష్టయ్యకు చెం దిన గొర్రెల మందపై ఆదివారం అర్ధరాత్రి వీధి కుక్కలు దాడి చేశాయి. బాధితుడు తెలిపిన వివ రాల ప్రకారం.. రోజూ మాదిరిగానే ఆదివారం గొర్రెలను కొట్టంలో ఉంచాడు. వీధి కుక్కలు గుంపు గా వచ్చి గొర్రెల మందపై ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో 13 గొర్రెలు మృతి చెందగా నాలుగు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన గొర్రెల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.





# జాతి అభివృద్ధే అంతిమ లక్ష్యం

**మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు**

**ఆదిలాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**
జాతి కోసం... ఆదివాసుల అభివృద్ధి కోసం కృషి చేస్తూనే, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆదివాసీలు పాల్గొన్నారు. ముందుగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీల సాంప్రదాయ వాయిద్యాలతో సభ ప్రాంగణం వరకు ర్యాలీ చేపట్టారు. ఆదివాసీల ఆరాధ్యదైవం కొమురం భీం, దళితుల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా సోయం బాపురావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సోయం బాపురావు మాట్లాడుతూ గతంలో తాను వేరే పార్టీలో ఉన్నప్పటికి మరో పార్టీ నుంచి పోటీ చేసిన బొజ్జు పటేల్ గెలవాలని కోరుకున్నానని చెప్పారు. తనకు, మాజీ ఎమ్మెల్యే సక్కుకు టికెట్ సమస్య వచ్చినప్పుడు ఆయనకే ఇవ్వాలని సూచించానని పేర్కొన్నారు. కొందరు నాపై విమర్శలు చేస్తున్నారని, కానీ నేను ప్రస్తుతం వారి జోలికి వెళ్లానని తెలిపారు. దేశంలోని అన్ని వ్యవస్థలపై బీజేపీ దాడి చేస్తోందని దానిని అడ్డుకోవడానికే రాజ్ గోండు సేవా సమితికి అధ్యక్షులుగా అయ్యానని వివరించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కుట్రలు పన్ని జీవో 49 తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ జీవో రద్దు కోసం రాబోవు రోజుల్లో ఉద్యమం తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. ఆదివాసులకు అన్యాయం జరిగితే ఆస్తులను అమ్మి అయిన ఉద్యమిస్తానని చెప్పారు. నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించేందుకు సీఎంతో మాట్లాడుతానని చెప్పారు. అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. రాజ్ గోండు సేవా సమితి బలోపేతం కోసమే సోయం బాపురావుకు అధ్యక్ష పదవి లభించిందని, ఆదివాసులందరిని ఏక తాటిపై తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వంలో ఆదివాసులకు ఎలాంటి న్యాయం జరగలేదని, సీఎం రేవంత్‌రెడ్డి మనవైపు ఉన్నారని న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఆదివాసీ సమాజం కోసం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, గ్రంథాలయం సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఆత్రం సక్కు, శ్రీనివాసరెడ్డి, గజేందర్, ఆత్రం సుగుణ, పాల్గొన్నారు.



## పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

**నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అంతకుముందు మధ్యాహ్న భోజన కార్మికులు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం వరకు చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఐదు నెలల పెండింగ్ విత్తనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యాశాఖ అధికారులకు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ లక్ష్మీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించిన శ్యామ్ నాయక్

**జైనూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**
జైనూర్ మండలంలోని అర్జపెల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్యామ్ నాయక్ సోమవారం పరిశీలించారు. లబ్ధిదారులు వేగంగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా చేయాలని, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## టీబీపై అవగాహన కలిగి ఉండాలి

**బజార్‌హత్నూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**
క్షయ(టీబీ) వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, జాగ్రత్త వహిస్తే పూర్తిగా నయమవుతుందని జిల్లా టీబీ అధికారి డాక్టర్ సుమలత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 41 మందికి టీబీ పరీక్షలు నిర్వహించి కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలపాటు దగ్గు, సాయంత్రం జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం ఉంటే స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు చికిత్స తీసుకుంటే నయమవుతుందని చెప్పారు. వైద్యులు శిల్ప, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్లు రాకపోతే చనిపోతం



**పురుగుల మందు డబ్బాతో పోలంపల్లి గ్రామస్తుల ఆందోళన**

**భీమారం, జూలై 28 (ప్రభాత సమాచారం)**
ఇందిరమ్మ కమిటీ సభ్యులు జాబితాలో మా పేర్లను పెట్టిన్రు. ఎంపీడీవో మధుసూదన్, ఇది వరకు ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శి సృజన లంచం తీసుకొని మా పేర్లను తొలగించి.. వేరే వాళ్ల పేర్లు నమోదు చేసిన్రు. ఇందిరమ్మ ఇండ్లు రాకపోతే గడ్డి మందు తాగి చనిపోతం." అంటూ మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లి గ్రామ పంచాయతీకి చెందిన నాయకుడు నక్క రమేశ్, సుందిల్ల వెంకటేశ్ ఆందోళనకు దిగారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి శ్వేత ముందు మందు డబ్బాతో ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు నక్క రమేశ్ పురుగుల మందుతో డబ్బాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం ఇంటింటికీ తిరిగి ఓట్లు వేయించానని, అలాంటిది నా పేరును తొలిగించి వేరే వారి పేర్లను నమోదు చేశారని ఆరోపించాడు. మాకు న్యాయం జరిగే వరకూ ఇందిరమ్మ ఇండ్ల ముగ్గు పోయవద్దని, అలా పోస్తే గడ్డి మందు తాగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో చనిపోతామని ముగ్గు పోసేందుకు అధికారులు వెళ్లకుండా అడ్డుకున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్వేత ఎంపీడీవో మధుసూదన్ దృష్టికి ఫోన్‌లో తీసుకుపోగా, ఆ విషయంలో తనకెలాంటి సంబంధం లేదని సమాధానం చెప్పారు.



## గ్రోమోర్ కేంద్రం తనిఖీ

**ముథోల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**
నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని మన గ్రోమోర్ ఎరువులు, పురుగు మందుల, దుకాణం ను ముథోల్ ఎస్ఐ బిట్ల పెర్సిస్, వ్యవసాయ అధికారి రచన సోమవారం తనిఖీ చేశారు. పురుగుమందులు, ఎరువులను పరిశీలించారు. పలు వివరాలను మన గ్రోమోర్ మేనేజర్ యోగేష్‌ని అడిగి తెలుసుకున్నారు. ఎరువులు, మందులు కొనుగోలు చేసిన రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అదించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మన గ్రోమోర్ ఏరియా మేనేజర్ నారాయణ స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ బూషీ రాకేష్ పాల్గొన్నారు

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**బెల్లంపల్లి, జూలై 28 (ప్రభాత సమాచారం)**
నిరుపేదల వైద్య ఖర్చుల కోసమే సిఎంఆర్ఎఫ్ పథకం ప్రభుత్వం అమలు చేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని 24వ వార్డు రడగంబాల బస్తీకి చెందిన దాముక శ్వేతకు మంజూరైన రూ. 40 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు నిరుపేదల కోసం ప్రవేశపెడుతున్నారన్నారు.

## విద్యార్థులకు ల్యాప్ ట్యాప్‌లు అందజేసిన ఐటీడీఏ పీవో

**ఉట్నూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**
మండలంలోని గిరిజన విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు పంపిణీ చేయడం జరిగిందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా తెలిపారు. సోమవారం ప్రాజెక్టు అధికారి ఛాంబర్‌లో ఉన్నత విద్య కోర్సులలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ల్యాప్‌టాప్‌లు అందించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యలో తమ ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ గౌతమ్ కు యు. పి. ఎస్. సి. పరీక్షలకు, కడెం మండలం చిన్న బెల్లాల్ గ్రామానికి చెందిన కుడిమెత మహేష్‌కు సిద్దిపేట జిల్లాలోని కొరపాకలో ఎల్ఎల్‌బి తృతీయ సంవత్సరం చదువుల కొరకు, నార్నూర్ మండలం బీంపూర్ గ్రామానికి చెందిన జాదవ్ శ్రావణ్ కు భువనేశ్వర్‌లో జెఈఈ మెయిన్స్ ఐఐటి. చదువుల కొరకు, కడెం మండలం పెద్దూరు గ్రామానికి చెందిన నాగవత్ రేవంత్ కు గౌహతిలో ఐఐటి, బిటెక్ చదువు కొరకు, సిరికొండ మండలం ధర్మసాగర్ గ్రామానికి చెందిన జవాన్ స్వప్నకు అలహాబాద్‌లోని




జెఈఈ మెయిన్స్ పరీక్షల కొరకు, దస్తురాబాద్ మండలం ఎర్రగుట్ట గ్రామానికి చెందిన భుక్య అఖిల్‌కు ధన్బాద్‌లోని ఐఐటి చదువుల కొరకు, నార్నూర్ మండలం తడిహత్నూర్ గ్రామానికి చెందిన పవర్ తేజ్పాల్‌కు జెఈఈ పరీక్షల కొరకు వారి తల్లిదండ్రుల సమక్షంలోపై చదువుల నిమిత్తం ల్యాప్ టాప్‌లను అందించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ కు స్థలం కేటాయించండి

**తాండూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**
తాండూర్ మండలంలో ప్రెస్ క్లబ్ నిర్వాహణకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని పాత్రికేయులు తహసీల్దార్ జ్యోష్నకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వార్తల ద్వారా ప్రభుత్వానికి తెలియజేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న పాత్రికేయులు తరపున స్థలం కేటాయించాలన్నారు.





# నాణ్యమైన పెట్రోల్, డీజిల్ సరఫరా చేయాలి

## ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా

**ఉట్నూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**
వహనదారులకు సిబ్బంది నాణ్యమైన పెట్రోల్, డీజిల్ సప్లయ్ చేయాలని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ కేంద్రంలో ఐటీడీఏ, జీసీసీ ద్వారా సంయుక్తంగా నడపబ డుతున్న పెట్రోల్ బంకును ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. కల్తీ లేకుండా నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందిం చాలని సిబ్బందిని ఆదేశించారు. ఫోన్ స్కానర్ అకౌంటును పరిశీలించి ఎలాంటి అవకతవక లేకుండా చూడాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్ ను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ ఉండాలని తెలిపారు. పెట్రోలు, డీజిల్ నాణ్యతలను జిసిసి పెట్రోల్ బంక్ మేనేజర్ ను అడిగి తెలుసుకున్నారు. పీఓ వెంట పెట్రోల్ మేనేజర్ బంకు నవజ్యోత్, సిబ్బంది తదితరులు ఉన్నారు. పెట్రోల్ బంక్ సమీపంలో జంగూబాయి గ్రూపు సభ్యులచే నడపబడు తున్న గిరిజన క్యాంటీన్ అకస్మికంగా తనిఖీ చేశారు. గ్రూపు సభ్యులకు సలహాలు సూచనలు అందించారు. భోజనం రుచికరంగా వండి పెట్టాలన్నారు. దాదాపుగా 350 మంది భోజనానికి వస్తారని అందులో 35 కేజీల బియ్యం, 10 కేజీల పప్పు, పది కిలోల కాయగూరలు వండి పెడుతున్నామన్నారు. ప్రతిరోజు 12 గంటల నుండి రెండు గంటల భోజనాలు వడ్డించడం జరుగుతుందనీ, ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులు,క్యాంటీన్ లో భోజనం రుచికరంగా ఉండాలని ప్రజల మనసు దోచుకోవాలని వంట పాత్రలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు.

# సంఘ భవనానికి స్థలం కేటాయించాలని వినతి



**నిర్మల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**
సంఘ భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కి సోమక్షత్రియ నకాశ్ సంఘం సభ్యులు వినతి పత్రం అందించారు. అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ నిర్మల్ పట్టణంలో దాదాపు 512 మంది కుటుంబాలు ఉన్నాయన్నారు. సామూహికంగా సమావేశాలు, ఉత్సవాలు నిర్వహించుకునేందుకు సరైన సంఘ భవనం లేదని, స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు.

# యువకుడిపై దాడి

**కాసిపేట, జూలై 28 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ముత్యంపల్లి గ్రామానికి చెందిన గిన్నె సతీశ్ అనే వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు కాసిపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ముత్యంపల్లి పెద్దమ్మ గుడి సమీపంలో ఆదివారం రాత్రి 8.30 గంటలకు సతీశ్ నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈక్రమంలో ముత్యంపల్లికి చెందిన ముదురకోల రాజు, ఆవుల రాజేందర్‌లు బైక్‌పై అతివేగంతో రాగా నెమ్మదిగా వెళ్లాల్సిందిగా సతీక్ సూచించాడు. దీంతో ఇద్దరు కలిసి సతీశ్‌పై దాడి చేసి తీవ్రంగా గాయ పర్చారు. సతీశ్‌ను పక్కకు నెట్టివేయడంతో బండ రాయిపై పడి ముఖానికి, తలకు తీవ్ర గాయాలై నట్లు ఎస్సై తెలిపారు. కాగా కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరు గైన చికిత్స కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలిం చినటలు పేర్కొన్నారు. బాధితుడి సోదరి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ముల్తానీల దాడి కేసులో 30 మంది అరెస్ట్

**ఇచ్చోడ, జూలై 28 (ప్రభాత సమాచారం)**
ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన కొంత మంది ముల్తానీలు పోలీసులపై రాళ్లతో దాడి చేసిన సంఘటనలో ఇప్పటి వరకు 30 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ఈ నెల 20న సిరిచెల్మ అటవీ ప్రాంతంలో బందోబస్తుకు వెళ్లిన పోలీసులపై కేశవపట్నం గ్రామానికి చెందిన ముల్తానీలు కొంత మంది దాడి చేశారు. దాడిలో ఎస్సైతో పాటు నలుగురు పోలీసులు గాయపడ్డారు. ఎస్పీ అఖిల్ మహజన్ ఆదేశాల మేరకు దాడికి పాల్పడిన 30 మందిపై కేసులు నమోదు చేసి రిమాండ్ తరలించారు. దాడితో ప్రమేయం ఉన్న మరో 30 మంది కోసం



పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. దాడి చేసిన ప్రధాన నిందితులు పోలీసులకు చిక్కకుండా దాక్కున్నట్లు తెలుస్తోంది.

# రేపటి నుంచి 'ఆకాంక్ష హాట్'

**ఆదిలాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**



నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాంలో భాగంగా 'వోకల్ ఫర్ లోకల్' ఆత్మను ప్రోత్సహించేందుకు గాను ఆకాంక్ష హాట్ పేరిట ఈ నెల 30 నుంచి ఆగస్టు 3వరకు స్థానిక ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మహిళా స్వయం సహాయ సంఘాలు, కళాకారులు, గిరిజన పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో 20 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. తగిరిజన సంప్రదాయ తినుబండారాలు, ఔషధ గుణాల ఉత్పత్తులు, చేతితో తయారు చేసిన వస్త్రాలు, సాంస్కృతిక అలంకరణ వస్తువులు వంటి స్థానిక ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆయా తేదీల్లో ఉదయం 11 నుం చి సాయంత్రం 6గంటల వరకు ప్రదర్శన ఉం టుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు హాట్ను సందర్శించి స్థానిక కళాకారులు, ఉత్ప త్తిదారులను ప్రోత్సహించాలని కోరారు.

## బాధితుల సమస్యలు పరిష్కరించాలి

**ఆదిలాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**
బాధితుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమ వారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 63 మంది అర్జీదారులు వచ్చి తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. సంబంధిత అధికారులకు ఆయన ఫోన్ చేసి మాట్లాడారు. విచారణ చేపట్టి బాధితు లకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజాఫిర్యాదుల



విభాగం అధికారి కవిత, సిబ్బంది వామన్ పాల్గొన్నారు.



# బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలి

## ఏరియా జీఎం జి దేవేందర్

**మందమర్రి, జూలై 28 (ప్రభాత సమాచారం)**
సింగరేణి యాజమాన్యం ఏరియాకు నిర్దేశించిన వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సహకరించాలని ఏరియా జీఎం దేవేందర్ కోరారు. ఏరియాలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీతో 8వ ఏరియా స్థాయి స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఏరియా మాట్లాడుతూ, సింగరేణి అభివృద్ధిలో, బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతలో కార్మిక సంఘాల పాత్ర కీలకమైనదని తెలిపారు. సింగరేణి యాజమాన్యం ఉత్పత్తి, ఉత్పాదకతలోనే కాకుండా ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా గడిచిన స్ట్రక్చరల్ సమావేశాలలో జరిగిన పనుల పురోగతిని చర్చించారు. గుర్తింపు సంఘ నాయకులు ప్రస్తావించిన పనులను పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, ఈ సమావేశంలో యాజమాన్యం తో 16 డిమాండ్లపై చర్చించడం జరిగిందన్నారు. ప్రధానంగా ఏరియాలో ఖాళీగా ఉన్న టెండాల్స్, టెండాల్స్ సూపర్వైజర్లు, ఇతర ఖాళీలను భర్తీ చేయడానికి యాజమా న్యం అంగీకరించిందన్నారు. అదేవిధంగా కార్మికులకు నాణ్యమైన బూట్లు, రెయిన్ కోట్ లతో పాటు కార్మిక కాలనీల సమస్యలైనా కార్మిక క్వార్టర్ల మరమ్మత్తులు, వైరింగ్ పనులు త్వరగా నిర్వహించేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. తొందరగా కార్మిక కాలనీలో ఎల్ ఈడి స్ట్రీట్ లైట్లు బిగించడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్మికులకు నాణ్యమైన డ్రిల్ రాడులు, బ్లాస్టింగ్ ఎక్స్ ప్లోడర్ లు ఇవ్వడానికి యాజమాన్యం సమావేశంలో అంగీకారం తెలిపిందని తెలియజేశారు. ఏరియా వర్క్ షాప్ లో మిషన్ షాఫ్ట మిషన్ లు కార్పొరేట్‌కు పంపి, కొత్తవి కొనుగోలు చేయడానికి యాజమాన్యం సమావేశంలో తన అంగీకారం తెలిపిందన్నారు. మిగిలిన సమస్యలను తొందరగా పరిష్కరించేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం స్థాయి స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, రామకృష్ణాపూర్ బ్రాంచ్ కార్యదర్శి అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, నాయకులు టేకుమట్ల తిరుపతి, తిరుపతి గౌడ్, ఏరియా ఎస్ఓటు జీఎం విజయ్ ప్రసాద్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఏజెంట్ ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.



# మాలగురిజాలలో భూ వివాదం

**బెల్లంపల్లి, జూలై 28 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలం మాలగు రిజాలలో భూ వివాదం నెలకొంది. గ్రామానికి చెం దిన ఏగోలపు రమాదేవికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. దీంతో సోమవారం రమా దేవి తమ స్థలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం పునాది పనులు చేపట్టింది. ఈ క్రమంలోనే కామెర లక్ష్మి కుటుంబీకులు రమాదేవి పునాది తవ్వు తున్న చోటుకు వెళ్లి పునాది పనులను అడ్డుకోవడం తో గొడవ జరిగింది. దీంతో రమాదేవి కుటుంబీకులకు, లక్ష్మి కుటుంబీకులకు ఘర్షణ తలెత్తింది. ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటే కిరోసిన్ పోసుకొని తామంతా ఆత్మహత్యకు పాల్పడుతామని రమాదేవి కుటుంబీకులు బోరున విలపించారు. దీంతో గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఘటన విషయాన్ని తాళ్లగురిజాల పోలీసులకు సమాచారం అందించగా తాళ్లగురిజాల ఎస్సై బి.రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని ఇరు కుటుంబాలను సముదాయించారు. దీంతో గొడవ సద్దుమనిగింది. అనంతరం ఇరువర్గాల వారు, గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఘటన విషయాన్ని తహసీల్దార్ కృష్ణతో విన్నవించగా భూ సమస్య ఉంటే సామరస్యంతో తేల్చు కోవాలని, వారం రోజుల్లో ఇరువర్గాల వారు సమ స్యను పరిష్కరించుకోవాలని సూచించారు. గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని ఈ సందర్భంగా వారికి తహసీల్దార్, ఎస్సై హెచ్చరించారు.

# తుడుం మోగించిన ఆదివాసీలు

- కలెక్టరేట్‌ను ముట్టడించిన ఆదివాసీలు
- కలెక్టరేట్‌లోకి చొచ్చుకు వెళ్లేందకు యత్నం..
- ఆదివాసీలను అడ్డుకున్న పోలీసులు
- ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం
- జీవో 49 రద్దు చేయాలని మహాధర్నా
- మద్దతు పలికిన ఎమ్మెల్యే హరీష్ బాబు, కృష్ణారావు








**ఆసిఫాబాద్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

కుమరంభీం కన్జర్వేషన్ రిజర్వ్ పేరిట ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 49ని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితీ, తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీలు కదం తొక్కారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నాకు పిలుపునివ్వడంతో జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీలు పెద్దఎత్తున తరలివచ్చారు. వీరి నిరసన కార్యక్రమానికి ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కుమరంభీం చౌక్‌లోని కుమరంభీం విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీగా కలెకట్రేట్‌కు చేరుకొని మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కోట్నాక విజయ్‌కుమార్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, మాజీ జడ్పీ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాక విజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ చట్టాలను తుంగలో తొక్కి దొంగదారిన జీవో 49ని తీసుకువచ్చిందన్నారు. ఆదివాసీలను అడవి నుంచి దూరం చేసే హక్కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. జీవో 49ని రద్దు చేసే వరకు నిద్రపోమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే జీవో 49ని రాష్ట్రప్రభుత్వం నిలుపుదల చేసిందని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కుమరంభీం, రాంజీగోండు, బీర్సా ముండా స్ఫూర్తితో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ జీవో 49 తీసుకురావడంలో కేంద్రప్రభుత్వ ప్రమేయం లేదన్నారు. ఎలాంటి గ్రామసభలు, తీర్మానాలు లేకుండానే దొడ్డి దారిన రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకువచ్చిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందడానికే జీవోను తాత్కాలికంగా నిలుపుదల చేసిందని ఇది కంటి తుడుపు చర్య అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయకుండా తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో జీవో 49పై ప్రభుత్వాన్ని ఎండగడతామన్నారు. జీవో రద్దు చేసేంత వరకు ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని, ఆగస్టు 4న కాగజ్‌నగర్ పట్టణంలోని ఫారెస్టు కార్యాలయాన్ని ముట్టడించాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని ఇచ్చేందుకు ఆదివాసీలు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో గేట్లు తీయాలని ఆదివాసీలు తోసే ప్రయత్నం చేయగా పోలీసులు వీరిని అడ్డుకున్నారు. దీంతో గేటు ఎదుట బైఠాయించి కలెక్టర్ బయటికి రావాలంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల నాయకులు కోవ విజయ్, గణేష్, ప్రభాకర్, మాంతయ్య, మడావి శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు అరిగెల మల్లిఖార్జున్, కొప్పుల శంకర్, వామపక్ష పార్టీల నాయకులు శ్రీనివాస్, దినకర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## మీనాక్షి నటరాజన్
# పాదయాత్ర

- తొలి విడతలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నియోజవకర్గంలో పాదయాత్ర, శ్రమదానం
- వారం రోజుల పాటు పాదయాత్ర చేయనున్న మీనాక్షి
- ప్రతి నియోజకవర్గంలో 8-10 కి.మీ. పాదయాత్ర
- స్థానిక నేతలతో ఇంటరాక్షన్ ప్రోగ్రామ్స్
- షెడ్యూల్ విడుదల చేసిన టీపీసీసీ
- 'స్థానిక' ఎన్నికల వేళ కీలక కార్యక్రమం



**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఏఐసీసీ ఆదేశాలతో తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ క్షేత్రస్థాయిలో పాదయాత్రకు ప్రణాళికను సిద్ధమైంది. ఉమ్మడి జిల్లాల్లో ఒక నియోజకవర్గంలో జిల్లా స్థాయి పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాలకు చేపట్టనున్నారు. ఈ మేరకు మెదటి విడతకు సంబంధించిన షెడ్యూల్‌ను సోమవారం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విడుదల చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కేతూరి వెంకటేశ్, జూలూరి ధనలక్ష్మి, పులి అనిల్ కుమార్‌లను కో-ఆర్డినేటర్లుగా నియమించారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు మొత్తం ఆరు జిల్లాల్లో పాదయాత్రతో పాటు శ్రమదానం కార్యక్రమాల్లో మీనాక్షి నటరాజన్ పాల్గొన బోతున్నారు. నిర్ణయించిన తేదీల్లో నియోజకవర్గంలోని ఒక ముఖ్యమైన కేంద్రంలో సాయంత్రం 5 గంటల నుంచి పది కిలోమీటర్లు మేర పాదయాత్ర చేయనున్నారు. అనంతరం అదే ప్రాంతంలో కాంగ్రెస్ కార్యకర్తలతో పల్లె నిద్ర, ఆ మరుసటి రోజు తెల్లవారుజామున గ్రామంలో పెద్ద ఎత్తున శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శ్రమదానం, అల్పహారం ముగించుకుని ఉదయం 10 గంటలకు జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన ఎమ్మెల్యేలు, మండలం, బ్లాక్ ప్రెసిడెంట్, డీసీసీ ఆఫీస్ బేరర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు.

**తొలి విడతలో ఇలా..**

తొలి విడత షెడ్యూల్ మొత్తం 6 జిల్లాల్లోని ఆరు నియోజకవర్గాల్లో మీనాక్షి నటరాజన్ పర్యటించబోతున్నారు. తొలుత ఈ నెల 31న రంగారెడ్డి జిల్లా పరిగిలో సాయంత్రం పాదయాత్ర ప్రారంభిస్తారు. ఆ రోజు రాత్రి అక్కడే బస చేసి ఉదయం శ్రమదానం, పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు. అనంతరం మెదక్ జిల్లా అందోల్ నియోతజకవర్గంలో పాదయాత్ర, శ్రమదానం చేపట్టనున్నారు. తరువాత నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, ఆదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గంలో తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ క్షేత్రస్థాయిలో పాదయాత్ర నిర్వహించి అక్కడి నుంచి కరీంనగర్‌లోని చొప్పదండి, వరంగల్‌లోని వర్ధన్నపేట నియోజకవర్గాల్లో మీనాక్షి నటరాజన్ పర్యటించబోతున్నారు. స్థానిక ఎన్నికల వేళ చేపట్టిన కార్యక్రమం రాజకీయంగా ఆసక్తిగా మారింది.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

## గిరిజన సలహా మండలి సమావేశంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**జైనూర్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర గిరిజనుల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు, జీవన ప్రమాణాల మెరుగుదలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని డీఎస్ఎస్ భవనంలో సోమవారం నిర్వహించిన ఏడో గిరిజన మండలి సమావేంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గోని గిరిజన సంక్షేమం, అభివృద్ధి అనే అంశంపై జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ రోడ్డు పునర్నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం పేద లబ్ధిదారులు ఆసిఫాబాద్ నియోజకవర్గంలో అనేక మంది ఉన్నారని వారు ఆర్థిక స్థోమత లేక ఇళ్లు కట్టుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ముందస్తుగా లక్షల రుపాయలు మంజురు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై లోతైన చర్యలు జరపాలని, గిరిజనులు విద్య, వైద్యం, తాగునీరు, రవాణా సౌకర్యాలు కల్పించడంలో వెనుకబడి ఉన్నామని పేర్కొన్నారు. దీంతో పాటు అటవీ హక్కుల చట్టం అమలు, పోడు భూముల సమస్యల పరిష్కారం, గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులపై సరైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని ఆమె కోరారు. గిరిజనుల సంస్కృతిసంప్రాదాయలను పరిరక్షించి, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి ఆవకాశాలపై దృష్టి సారించాలని కోరారు. గిరిజన ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు తగిన ప్రోత్సాహం అందించి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజనులు ఉన్నతి కోసం సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి వాటిని పకడ్బందీగా అమలు చేయాలని, ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాసరలో వేడుకగా నవగ్రహ
# దేవతా మూర్తుల పునః ప్రతిష్ట

**ముథోల్, జూలై 28 (ప్రభాత సమాచారం)**

శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి ఉప అలయమైన శ్రీ సూర్యేశ్వర ఆలయ ప్రాంగణంలో నవగ్రహ విగ్రహ పునః ప్రతిష్టను ఆలయ అర్చకులు వేద పండితులు ప్రారంభించరు. గురు మదనానంద సరస్వతి పీఠాధిశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి సూచనల మేరకు నవగ్రహ దేవత పునః ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఉదయం మంగళ వాయిద్యములతో వరుణ పూజ ,గోదావరి నది జలాల సంగ్రహణము, ప్రతిష్ఠా సంకల్పము ,గణపతి పూజ, రక్షాబంధనం, రిత్విక్ వరణం, పంచగవ్యప్రాశన, దేవతా స్థాపన అగ్ని ప్రతిష్టనతో స్థానాచార్యులు ప్రవీణ్ పాటాక్, ప్రధానార్చకులు సంజీవ్ పూజారి ఆధ్వర్యంలో ఆలయ వైదిక బృందం నిర్వహించారు. పూజ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయులు శరత్ పాఠక్, ఆలయ ఈఓ సుధాకర్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

